సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
ఆదివారం, 27.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 327
పేజీలు: 08 వెల: రూ. 5

## సర్ నోటీసులు వస్తే విచారణకు రానక్కర్లేదు

**కేంద్ర ఎన్నికల సంఘం భేటీ..** 02

- నోటీసులు వచ్చినా ఆఫీసుల చుట్టూ తిరగొద్దు
- ఓటర్ల ఇళ్లకే వెళ్లనున్న బీఎల్ఓలు
- డాక్యుమెంట్ల పరిశీలన.. ఆన్‌లైన్ అప్‌లోడ్ కూడా
- ఎస్ఐఆర్‌పై ఈసీ కీలక నిర్ణయం
- ఓటర్లకు ఇబ్బందులు లేకుండా కొత్త విధానం




## పంచాయతీలకు
# గుడ్‌న్యూస్..
### సొంత భవనాలకు రూ.1,000 కోట్లు



- భవనాలు లేని 5,118 గ్రామ పంచాయతీలకు నిధులు
- 3,269 భవనాల నిర్మాణం 70 శాతం పూర్తి
- ఈ ఏడాదిలోనే మిగిలిన పనులు పూర్తి చేస్తాం: మంత్రి సీతక్క
- 8 వేల గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలకు రూ.800 కోట్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణలో సొంత భవనాలు లేని ప్రతి గ్రామ పంచాయతీకి భవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,118 గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణం కోసం రూ.1,000 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే 3,269 భవనాల నిర్మాణ పనులు 70 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ ఏడాదిలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.
అదే విధంగా 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి రూ.800 కోట్లు కేటాయించామని, ఈ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన ప్రాంతీయ సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

**హ్యామ్ విధానంలో గ్రామీణ రహదారులు**
దేశంలోనే తొలిసారిగా గ్రామీణ రహదారులను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) విధానంలో నిర్మిస్తున్నామని సీతక్క తెలిపారు. తొలి విడతలో నాలుగు ఉమ్మడి జిల్లాల్లో రూ.3,382 కోట్ల అంచనా వ్యయంతో 3,861 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు పనులకు అనువైన కాలం కావడంతో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

**తాగునీటిపై ప్రత్యేక దృష్టి**
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. సింగూరు రిజర్వాయర్‌లో నీటి మిగతా 02లో



## కారు దిగడం
# ఖాయమేనా?!
### బీజేపీ నేతలతో మల్లారెడ్డి భేటీ..

- పెరిగిన ఊహాగానాలు
- కారు దిగేందుకు మల్లారెడ్డి రెడీనా?
- టికెట్లపై మల్లారెడ్డి కుటుంబం భారీ స్కెచ్?
- మల్లారెడ్డి కోసం ఈటల సీటుకు ఎసరా?
- మంచి అవకాశం కోసం మల్లారెడ్డి ఎదురుచూపులు?
- బీజేపీతో మల్లారెడ్డి టచ్‌లో ఉన్నారనే ప్రచారం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
బీఆర్ఎస్ మల్కాజ్ గిరి ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడుతారన్న ఊహాగానాలు సాగుతూనే ఉన్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ఆయన కాంగ్రెస్ లేదా బీజేపీ పార్టీల్లో చేరడం ఖాయం అన్న వార్తలు వస్తూనే ఉన్నాయి. వాటిని ఆయన ఖండిస్తూ వస్తున్నారు. అయితే ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విద్యాసంస్థల ఆక్రమణల మీదకు వచ్చినప్పుడు బెంగళూరులో ప్రస్తుత సీఎం, అప్పటి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను కలిశారని, ఆ తర్వాత మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలవడం, బీజేపీ పార్టీ కార్యాలయానికి వెళ్లడం పార్టీ మార్పుపై చర్చలకు దారితీసింది. అయితే మల్లారెడ్డి యూనివర్సిటీ ఏఐ క్యాంపస్, డిజిటల్ ఇండియా స్కిల్ సెంటర్ ప్రారంభోత్సవానికి ప్రధాన అతిథిగా ఆహ్వానించడానికే అని వివరణ ఇచ్చారు.
తాజాగా ఆస్ట్రేలియా బ్రిస్బేన్ లోని ఇండియన్ కల్చరల్ సొసైటీ కన్వెన్షన్ ఆహ్వానం మేరకు ఆస్ట్రేలియా వెళ్లిన సందర్భంగా టూవుంబా మేయర్ జియోఫ్ మెక్ డొనాల్డ్ తో కలిసిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మల్లారెడ్డి, పైడి రాకేష్ రెడ్డిలతో కలిసి ఉన్న ఫోటోలను ఎక్స్ లో షేర్ చేయడంతో పార్టీ మార్పు అంశం మీద మరోసారి చర్చ మొదలైంది. ఆస్ట్రేలియా వెళ్లిన మల్లారెడ్డికి బ్రిస్బేన్‌లో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా క్వీన్స్ లాండ్ కన్వీనర్ విన్నీ తూముకుంట ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆహ్వానం పలికాయి. అయితే ఆయన ఆ తర్వాత బీజేపీ ముఖ్యులతో సమావేశం కావడమే ఇక్కడ చర్చకు దారితీసింది. మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డికి మిగతా 02లో

## ఖాకీ డ్యూటీ..
# కల్చర్‌తో స్టెప్పులు
తెలంగాణ పోలీసులపై ప్రశంసల వర్షం



- పండుగల్లో పోలీసన్నల సందడి
- యూనిఫామ్‌లో స్టెప్పులు
- విధితో పాటు సంస్కృతిలో భాగస్వామ్యం

02

## కేటీఆర్ 03
# థియేటర్ ఎంట్రీ
నాని 'ప్యారడైజ్' చూసేందుకు రెడీ

- కేటీఆర్ ట్వీట్‌తో వైరల్‌గా మారిన ప్యారడైజ్
- మిక్స్‌డ్ టాక్.. అయినా దూసుకెళ్తున్న
- నైజాంలో నాని సినిమాకు అదిరిపోయే వసూళ్లు



## కాళేశ్వరంపై ప్రభుత్వం
# కీలక నిర్ణయం
2027 వానాకాలానికి ముందే పూర్తి

- అక్టోబర్ 5న డిజైన్లు సమర్పణ
- భద్రత, నాణ్యతపై రాజీ లేదు
- 3 బ్యారేజీల సామర్థ్యం పునరుద్ధరణ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

02



## మనిషి ఆదేశాలు లేకుండానే
# గేట్లు దాటుతున్న ఏఐ
### అమెరికా వెబ్‌సైట్లలోకి ఓపెన్‌ఏఐ బాట్లు.. షాకింగ్ విషయాలు

- ప్రభుత్వ సైట్లను యాక్సెస్ చేసిన AI బాట్లు
- ఓపెన్ ఏఐ ఏజెంట్లతో కొత్త సైబర్ భయం
- సీక్రెట్ డేటా లీక్ కాలేదన్న సంస్థ
- ఆస్ట్రేలియాలోనూ ఓపెన్ ఏఐపై ఆరోపణలు
- ఏఐకి స్వేచ్ఛ.. సైబర్ సెక్యూరిటీకి ముప్పా?

**ముద్ర, హైదరాబాద్ :**
ఏఐతో సైబర్ సెక్యూరిటీపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ.. ఓపెన్‌ఏఐ బాట్లకు సంబంధించిన తాజా ఘటన కలకలం రేపుతోంది. అమెరికా ప్రభుత్వానికి చెందిన సెన్సస్ బ్యూరో, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (SEC) సహా పలు అధికారిక వెబ్‌సైట్లను ఓపెన్‌ఏఐ ఏఐ ఏజెంట్లు యాక్సెస్ చేసినట్లు సంస్థ నిర్వహించిన దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఈ యాక్సెస్ ద్వారా ఎలాంటి రహస్య లేదా సున్నితమైన సమాచారం లీక్ కాలేదని ఓపెన్‌ఏఐ స్పష్టం మిగతా 02లో



# ట్రంప్ ఖేల్ ఖతం..
### ట్రంప్ టారిఫ్‌లపై అమెరికన్ల ఆగ్రహం

- మధ్యంతర ఎన్నికలపై సర్వేల్లో డెమొక్రాట్ల ఆధిక్యం
- ట్రంప్‌నకు సర్వేల భయం
- ధరల పెరుగుదలతో రిపబ్లికన్లకు టెన్షన్
- ట్రంప్‌కు భారీ ఎదురుదెబ్బ?
- వచ్చేసారి అధికారమే కష్టమే..

02



## ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో
# పోటీకి రెడీ
### ది ప్యారడైజ్ సినిమాలో కేసీఆర్‌ను అవమానించారు

- కేసీఆర్ పాటలకు డబ్బులిచ్చి డ్యాన్స్ చేయిస్తున్నారు
- త్వరలో నా పాదయాత్ర ఉంటుంది
- 'భైరవ' బస్సులో రాష్ట్రవ్యాప్త పర్యటన..
- పీకే ట్రోలింగ్‌పై కౌంటర్
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

02



# ఉత్తర తెలంగాణ రాజకీయాలను మార్చే సిరిసిల్ల సభ

06

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్ కు లేదు : మంత్రి శ్రీధర్ బాబు
- యువరాజు కోటను బద్దలు కొడుతాం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 27.09.2026
www.mudranews.in | @mudranews





### టర్బినేట్లు ఉబ్బితే..

అలర్జీ, ఇన్‌ఫెక్షన్ల కారణంగా ముక్కులోని టర్బినేట్లు ఉబ్బితే ముక్కుదిబ్బడ ఏర్పడుతుంది. గాలి సరిగా వెళ్లక నోటితో శ్వాస తీసుకోవడం మొదలవుతుంది. ఫలితంగా గురక సమస్య వేధించొచ్చు.

# పంచాయతీలకు గుడ్‌న్యూస్

**(మొదటి పేజీ తరువాయి)**
మట్టం తక్కువగా ఉన్నందున నిజాంసాగర్ నుంచి నీటిని తరలించే ప్రక్రియను వేగవంతం చే యాలని సూచించారు. ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో 'డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరిజన, చెంచు పెంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**నిర్లక్ష్యం చేస్తే చర్యలు**
గ్రామీణ ప్రాంతాల్లో పనుల కొరత రాకుండా ఉపాధి హామీ పథకానికి కేటాయించిన రూ.6,000 కోట్ల బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీతక్క సూచించా రు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమ ర్థంగా పనిచేసే అధికారులను సన్మానిస్తామని, అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మనిషి ఆదేశాలు లేకుండానే

# గేట్లు దాటుతున్న ఏఐ




**(మొదటి పేజీ తరువాయి)**
చేసింది. ఏఐ ఏజెంట్లు సమాచారాన్ని సేకరించే క్రమంలో ఊహించని విధంగా కొన్ని వెబ్‌సైట్లను యాక్సెస్ చేసినట్లు తెలిపింది. ఇదే సమయంలో ఆస్ట్రేలియా ప్రభుత్వ వెబ్‌సైట్‌కు సంబంధించిన ఘటన కూడా చర్చనీయాంశంగా మారింది. తమ ప్రభుత్వ వెబ్‌సైట్‌ను ఓపెన్ఏఐ ఏఐ ఏజెంట్ అనధికారికంగా యాక్సెస్ చేసిందని ఆస్ట్రేలియా ప్రధాని ఆరోపించారు. దీంతో ఏఐకి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ సైబర్ సెక్యూరిటీకి కొత్త ముప్పులు ఎదురవుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి రహస్య సమాచారం బయటకు వెళ్లలేదని చెబుతున్నప్పటికీ.. భవిష్యత్తులో ఏఐ ఏజెంట్లకు విధించే పరిమితులు, భద్రతా నియంత్రణలు ఎలా ఉండాలన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

# సర్ నోటీసులు వస్తే విచారణకు రానక్కర్లేదు

**ముద్ర, న్యూఢిల్లీ :**
కేంద్ర ఎన్నికల సంఘంలో ఇటీవల ప్రధాన అధికారుల మధ్య విభేదాలు నెలకొన్నాయనే వార్తల నేపథ్యంలో ఈసీ ఉన్నతాధికారులు అత్యవసరంగా భేటీ అయ్యారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈసీ పరిధిలోని అంతర్గత అంశాలు, ఇటీవల కమిషనర్ల మధ్య వచ్చిన అభిప్రాయ భేదాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు సమాచారం. కమిషన్ పనితీరు సమర్థవంతంగా సాగేలా అధికారుల మధ్య సమన్వయాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు.
మరోవైపు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి సాధారణ ప్రజలు, ఓటర్లకు పెద్ద ఉపశమనం కలిగించే కీలక నిర్ణయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు సదరు వివరాలు లేదా పత్రాలు సమర్పించేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్ల (BLO) కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది.
నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు ఇంటికే నేరుగా బిఎల్ఓ (బీఎల్ఓ)లు వెళ్లాలని అధికారులను ఆదేశించింది. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బిఎల్ఓలే స్వయంగా ఇళ్లకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు, ఆధారాలను పరిశీలించి సేకరిస్తారు. వాళ్లే ఆన్లైన్లో అవసరమైన డాక్యుమెంట్లు అప్ లోడ్ చేస్తారని పేర్కొంది. ఓటర్లు కార్యాలయాల వద్ద క్యూలలో నిలబడి ఇబ్బందులు పడకుండా చూసేందుకే ఈ కీలక మార్పులు చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

# కారు దిగడం ఖాయమేనా ?!

**(మొదటి పేజీ తరువాయి)**
మల్కాజిగిరి ఎంపీ టికెట్, కుమారుడు భద్రారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డికి మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యే టికెట్లు అడుగుతున్నారని అంటున్నారు. కొన్ని ప్రస్తావనల్లో నాలుగు ఎమ్మెల్యే, ఒక ఎంపీ టికెట్ అడుగుతున్నారని కూడా చెబుతున్నారు. అయితే బీజేపీ మాత్రం ముందు పార్టీలో చేరి పనిచేయండి, ఆ తర్వాత టికెట్ల అంశాన్ని పరిశీలిద్దాం అంటున్నారని సమాచారం. అయితే మల్కాజిగిరి లోక్ సభ స్థానం నుండి మాజీ మంత్రి ఈటెల రాజేందర్ పోటీ చేసి గెలిచారు. బీఆర్ఎస్ నుండి బహిష్కరించిన అనంతరం ఆయన సొంత పార్టీ పెడతారని అనుకున్నా ఆయన బీజేపీలో చేరడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఆ పార్టీలో చేరి ఎంపీగా గెలిచారు. కేంద్ర మంత్రి అవుతారు, లేదా రాష్ట్ర బీజేపీ అధ్యక్ష్య పదవి ఇస్తారని ప్రచారం జరిగినా అది ఊహాగానాలకే పరిమితం అయింది. మరి మల్లారెడ్డి కోసం బీజేపీ ఏకంగా సిట్టింగ్ ఎంపీ ఈటెలను పక్కనపెట్టి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తారన్నది అనుమానమే. వ్యాపారాలు, విద్యాసంస్థల నేపథ్యంలో మల్లారెడ్డి పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నది నిజమే అని గత పరిణామాలు అన్నీ పరిశీలిస్తే అర్థమవుతోంది. కానీ ఆయన ఒక అవకాశం కోసం వేచి చూస్తున్నారని తెలుస్తోంది.



# ఖాకీ డ్యూటీ.. కల్చర్‌తో స్టెప్పులు



**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ అంటేనే పండుగలు, జాతరలు, సంప్రదాయాలకు పెట్టింది పేరు. బోనాలు, బతుకమ్మ, మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర, గణేష్ నిమజ్జనం వంటి వేడుకల్లో ప్రజల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అయితే ఈ భారీ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిరంతరం విధులు నిర్వర్తించే పోలీసులు కూడా ఇప్పుడు పండుగల్లో భాగం అవుతూ అందరి దృష్టి ఆకర్షిస్తున్నారు.
లక్షలాది మంది భక్తులు, ప్రజలు పాల్గొనే వేడుకల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహాన్ని క్రమబద్ధీకరించడం, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడటం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. అవకాశం దొరికినప్పుడు పండుగ వాతావరణంలో తమదైన శైలిలో సందడి చేస్తున్నారు. ముఖ్యంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుల చప్పుళ్లతో ఉత్సవ వాతావరణం హోరెత్తుతున్న సమయంలో కొందరు పోలీసులు కూడా ఉత్సాహంగా అడుగులు వేస్తున్నారు. యూనిఫామ్‌లోనే డాన్స్ చేస్తూ పండుగ సంబరాల్లో కలిసిపోతున్న పోలీసుల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**విధి నిర్వహణతో పాటు సంస్కృతికి దగ్గరగా..**
పోలీసుల పని కేవలం చట్టాన్ని అమలు చేయడం, భద్రత కల్పించడానికే పరిమితం కాదని ఈ దృశ్యాలు మరోసారి చాటుతున్నాయి. ప్రజలతో మమేకమై, వారి సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవిస్తూ విధులను నిర్వర్తించడం ద్వారా పోలీసులకు, ప్రజలకు మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడుతోంది. మేడారం జాతర నుంచి బోనాలు, బతుకమ్మ వరకు.. అలాగే గణేష్ నిమజ్జనం వంటి భారీ కార్యక్రమాల్లో పోలీసులు గంటల తరబడి విధులు నిర్వహిస్తుంటారు. అలాంటి సమయంలో పండుగ ఉత్సాహంలో కాసేపు భాగస్వాములవుతూ వారు వేసే స్టెప్పులు ప్రజల్లోనూ ఆనందాన్ని నింపుతున్నాయి.

**నెటిజన్ల ప్రశంసలు**
యూనిఫామ్‌లోనే పోలీసులు పండుగల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న వీడియోలకు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. 'పోలీసు ఉద్యోగం కాదు.. ప్రజలతో మమేకమయ్యే బాధ్యత', 'విధి నిర్వహణలోనూ తెలంగాణ సంస్కృతిని కాపాడుతున్నారు' అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ప్రజల భద్రత కోసం కఠినమైన విధులు నిర్వర్తిస్తూనే.. తెలంగాణ పండుగలు, జాతరల ప్రత్యేకతను ఆస్వాదిస్తూ సంస్కృతిలో భాగమవుతున్న పోలీసుల తీరు ఇప్పుడు ప్రత్యేకంగా నిలుస్తోంది. బాధ్యతను కేవలం ఉద్యోగంగా కాకుండా ప్రజలతో ఉన్న బంధంగా భావిస్తున్న ఈ పోలీసుల డాన్స్‌లు పండుగలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొస్తున్నాయి.

# ట్రంప్ ఖేల్ ఖతం



**ముద్ర, న్యూ ఢిల్లీ:**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు 2026 మధ్యంతర ఎన్నికలు కఠిన పరీక్షగా మారుతున్నాయా? భారీ టారిఫ్‌లు, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, జీవన వ్యయం అమెరికన్ ఓటర్లలో అసంతృప్తిని పెంచుతున్నాయని తాజా సర్వేలు సూచిస్తున్నాయి. ఎన్‌పీఆర్/పీబీఎస్ న్యూస్–మారిస్ట్ పోల్ ప్రకారం.. ప్రస్తు తం ఎన్నికలు జరిగితే డెమొక్రాట్లకు 53 శాతం, రిపబ్లికన్లకు 41 శాతం మంది మద్దతు ఇస్తామని తెలిపారు. అంటే డెమొక్రాట్లకు 12 శాతం పాయింట్ల ఆధిక్యం ఉంది. మరోవైపు రాయి టర్స్/ఇప్సోస్ సర్వేలోనూ డెమొక్రాట్లకు ఆధిక్యం కనిపించింది. ముఖ్యంగా ధరలు, ద్రవ్యోల్బణం విషయంలో ట్రంప్ ప్రభుత్వ పనితీరుపై ఓటర్లలో తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ట్రంప్ పనితీరుకు సంబంధించిన ఓవరాల్ అప్రూవల్ రేటింగ్ కూడా గణనీయంగా తగ్గినట్లు నివేదికలు సూచిస్తున్నాయి.
ఇదిలా ఉండగా, టారిఫ్‌ల ద్వారా వచ్చే ఆదాయంతో అమెరికన్లకు భారీ మొత్తాన్ని తిరిగి చెల్లించే ఆలోచనను ట్రంప్ ప్రతిపాదించారు. ప్రతి వయోజనుడికి సుమారు 5,000 డాలర్లు చెల్లించే 'ట్రంప్ డివిడెండ్' ప్రతిపాదనపై చర్చ జరుగుతోంది. అయితే ఈ పథకానికి అవసరమైన నిధుల విషయంలో ఆర్థిక నిపుణులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మధ్యంతర ఎన్నికల్లో అధికార పార్టీకి వ్యతిరేకత కనిపించడం సహజమే. అయితే ఈసారి ధరల పెరుగుదల, టారిఫ్‌ల ప్రభావం, ట్రంప్ పాలనపై అసంతృప్తి కలిసివస్తే రిపబ్లికన్లకు గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో పరిస్థితులు మారే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుత సర్వేలు మాత్రం ట్రంప్‌కు స్పష్టమైన హెచ్చరిక సంకేతాలు ఇస్తున్నాయి.

# ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో పోటీకి రెడీ

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విలేకరులతో జరిపిన చిట్ చాట్‌లో పలు ఆసక్తికర, సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాబోతుందని వ్యాఖ్యానించారు. ఇటీవల గణేష్ నిమజ్జనంలో కేసీఆర్ పాటలకు డాన్సులు చేయమని డబ్బులు ఇచ్చి మరీ చేయించారని, అదంతా ఆ పార్టీ పెయిడ్ టీమ్ ఆడిన డ్రామా అని ఎద్దేవా చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ ఆయన ఒక 'అట్టర్ ఫ్లాప్ సీఎం' అని అభివర్ణించారు. తమ పార్టీ కొడంగల్ సభ అత్యంత ప్రాధాన్యతతో సక్సెస్ అయిందని, తాము ప్రజా సమస్యలపై మాట్లాడినప్పుడే ఈ ప్రభుత్వం స్పందించి చర్యలకు పూనుకుంటోందని కవిత స్పష్టం చేశారు.

**ఎండాకాలంలో 'భైరవ' బస్సులో పాదయాత్ర – పవన్ కళ్యాణ్ ట్రోలింగ్‌పై కౌంటర్**
రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలతో నేరుగా మమేకమయ్యేందుకు రాబోయే ఎండాకాలం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు కవిత ప్రకటించారు. ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా ఒక బస్సు సిద్ధమవుతోందని, దానికి 'భైరవ' అని పేరు పెట్టాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇక జనసేనాని, పవన్ కళ్యాణ్ టీమ్ కావాలనే సోషల్ మీడియాలో తనను ట్రోల్ చేస్తోందని, కానీ తాను వాటిని పెద్దగా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నానని చెప్పారు. ఒకవేళ పవన్ కళ్యాణ్ తెలంగాణ రాజకీయాలు లేదా ప్రాంతంపై మాట్లాడితే, తాను కూడా ఖచ్చితంగా స్పందించి సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు. అలాగే 2027 దసరా నాటికి బతుకమ్మ పండుగను గిన్నిస్ రికార్డులోకి ఎక్కించేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తామన్నారు.

**రాబోయే ఎన్నికల్లో పోటీపై స్పష్టత – ఎమ్మెల్సీ స్థానాల్లో రాజకీయ వ్యూహాలు**
ముందున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నట్లు కవిత తెలిపారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో తమ తెలంగాణ రక్షణ సేన ఖచ్చితంగా పోటీ చేస్తుందని పునరుద్ఘాటించారు. అంతే కాకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అభ్యర్థులను నిలబెట్టే ఆలోచనలో ఉన్నామన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ స్థానంలో ఒక ముస్లిం మైనారిటీ అభ్యర్థిని బరిలోకి దింపుతామని తెలిపారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ స్థానాల్లో తమ పార్టీ మద్దతు కావాలని పలువురు కోరుతున్నారని, అయితే దానిపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు.

## కాళేశ్వరంపై ప్రభుత్వం

# కీలక నిర్ణయం



**ముద్ర, హైదరాబాద్:**
నవంబర్ రెండో వారంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షలో ఆయన మాట్లాడారు. "2027 వానాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి చేస్తాం. అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి డిజైన్లు సమర్పిస్తాం. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. భద్రత, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పునరుద్ధరణ పనులు చేపడతాం. మేడిగడ్డ, అననారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేస్తాం. మూడు బ్యారేజీల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తాం. ఎన్‌డీఎస్ఏ, నిపుణుల కమిటీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాం" అని ఉత్తమ్ తెలిపారు.

## గొల్ల కురుమల అభివృద్ధికి

# కట్టుబడి ఉన్నాం




**ముద్ర, కరీంనగర్:**
గొల్ల కురుమల సామాజిక ఆర్థిక రాజకీయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబ డి ఉందని, వారి అభివృద్ధికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కరీంనగర్ జిల్లా పద్మ నగర్‌లోని ఇందిరా గార్డెన్స్ లో శనివారం ఏర్పాటు చేసిన కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఇదే కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెలు, మేకల బీమాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి పథకం ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గొల్ల కురుమలకు అనేక వాగ్దానాలు చేసి వారిని అభివృద్ధి చేసిన సందర్భం లేదని అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులవృత్తిదారులను ప్రోత్సహిస్తుందని, వారిని అన్ని రంగాల్లో ముందుంచేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. గొల్ల కురుమలు జీవాలను మేపేందుకు నెలల తరబడి వలస వెళ్తారని, ఈ సమయంలో వారికి అనేక ప్రమాదాలు వచ్చి ఉంటాయని తెలిపారు. గొర్రెలతో పాటు పెంపకం దారులకు తగిన బీమా కల్పించేలా చూస్తామని తెలిపారు. ఏడాదికి కేవలం 13 రూపాయలు చెల్లించి ఒక గొర్రె లేదా మేకకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. మిగతా సొమ్ము ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. ప్రతి శనివారం హైదరాబాద్కు ఇతర రాష్ట్రాల నుండి వేలకొద్దీ గొర్రెలు మేకలు అమ్మకానికి వస్తాయని తెలిపారు. తెలంగాణలోనూ ఈ దిశగా పెంపకం దారులు ఉత్పత్తిని పెంచాలని సూచించారు.
రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు, కులవృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 750 వరకు గొల్ల కురుమల సహకార సంఘాలు 3200 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం చేసుకోవడం అభినందనీయమని అన్నారు. అనేకమంది సభ్యులు 55 సంవత్సరాలకు పింఛన్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నారని తెలిపారు. కులవృత్తిదారులందరికీ 55 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాల్సిందిగా ప్రతిపాదిస్తామని తెలిపారు. ఇందిరమ్మ బీమా పథకంలో భాగంగా కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల బీమాకు కేబినెట్ ఆమోదం తెలిపిన విష యాన్ని గుర్తు చేశారు. గొర్రెల పెంపకానికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను సంఘాలకు కేటాయించాల్సిందిగా చర్యలు తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఎన్‌సీడీసీ రుణాన్ని మాఫీ చేయాల్సిందిగా సీఎం ముందు ప్రతిపాదన ఉంచుతామని తెలిపారు. అలాగే కరీంనగర్లో హోల్ సేల్ మాంసం విక్రయాల మార్కెట్ ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కోపరేటివ్ ఫెడరేషన్ చైర్ పర్సన్ కే.సరిత తిరుపతయ్య మాట్లాడుతూ.. కురుమ యాదవులు, పశు సంపద ఎక్కువగా ఉన్న కరీంనగర్ జిల్లాలో బీమా పథకం ప్రారంభించడం సంతోషదాయకమని తెలిపారు. చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గొల్ల కురుమలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.
ఈ సమావేశంలో యాదవ, కురుమ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, పశుగణన అభివృద్ధి చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, పశు సంవర్ధక శాఖ ఎండీ సుబ్బారాయుడు, జేడీ లింగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షులు బాషవేని మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్ కురుమ, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, శ్రీరామ్ చక్రవర్తి పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 27.09.2026
www.mudranews.in | @mudranews



### సైనసైటిస్ ఉంటే జాగ్రత్త..

దీర్ఘకాలిక సైనసైటిస్ వల్ల ముక్కులో వాపు, జిగురుద్రవం పెరుగుతాయి. దీంతో ముక్కుదిబ్బడ ఏర్పడి రాత్రిపూట శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఇది గురకకు కారణం కావొచ్చు.



## కేటీఆర్ థియేటర్ ఎంట్రీ..

**నాని 'ప్యారడైజ్' చూసేందుకు కేటీఆర్ రెడీ**



**ముద్ర, హైదరాబాద్** : చాలా కాలం తర్వాత బిగ్ స్క్రీన్ పై సినిమా చూసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సిద్ధమయ్యారు. అయితే ఆయన ఎంచుకున్న సినిమా ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారిన 'ది ప్యారడైజ్'. నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను థియేటర్ లో చూడబోతున్నట్లు కేటీఆర్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. సినిమాలు చూడటంలో తనకు పెద్దగా ఆసక్తి లేదనే భావన ఉన్న కేటీఆర్.. చాలా ఏళ్ల తర్వాత థియేటర్ కు వెళ్తున్నట్లు చెప్పడం ఇప్పుడు ఆసక్తిని పెంచుతోంది. అందులోనూ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో వచ్చిన 'ది ప్యారడైజ్'నే ఆయన ఎంచుకోవడం ప్రత్యేక చర్చకు దారితీసింది. నాని తనకు ఇష్టమైన నటుల్లో ఒకరని, శ్రీకాంత్ ఓదెల ప్రతిభావంతమైన యువ దర్శకుడని కేటీఆర్ ప్రశంసించారు.

**సినిమా కంటే కేటీఆర్ కామెంట్సే హైలైట్**

'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో మిశ్రమ స్పందన ఉన్న సమయంలో కేటీఆర్ థియేటర్ కు వెళ్లాలని నిర్ణయించుకోవడం సినిమాకు మరో రకమైన ప్రచారంగా మారింది. ముఖ్యంగా తెలంగాణలో నానికి ఉన్న మార్కెట్, నైజాంలో వస్తున్న వసూళ్ల నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఇప్పటికే విడుదలైన రెండు రోజుల్లోనే సినిమా రూ.100 కోట్ల క్లబ్ లోకి అడుగుపెట్టినట్లు చిత్రబృందం వెల్లడించింది. టాక్ పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ వసూళ్ల పరంగా సినిమా దూకుడు కొనసాగిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

**నైజాంలో నాని 'ప్యారడైజ్' జోరు**

ముఖ్యంగా నైజాం ప్రాంతంలో 'ది ప్యారడైజ్'కు వస్తున్న స్పందన సినిమాకు బలంగా మారింది. సోషల్ మీడియాలో ట్రోలింగ్, మిక్స్ డ్ టాక్ ఉన్నప్పటికీ థియేటర్లలో ప్రేక్షకుల రాకపై పెద్దగా ప్రభావం కనిపించకపోవడం ఆసక్తికరంగా మారింది. వీకెండ్ లో కూడా ఇదే స్థాయిలో వసూళ్లు కొనసాగితే తెలంగాణ మార్కెట్ లో సినిమా బ్రేక్ ఈవెన్ కు చేరుకునే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేటీఆర్ థియేటర్ ఎంట్రీ సినిమాపై మరింత ఆసక్తిని పెంచే అవకాశముంది.

మొత్తానికి.. సినిమా చూడటానికి కేటీఆర్ థియేటర్ కు వెళ్లడం ఒక సాధారణ విషయం కావచ్చు. కానీ 'ది ప్యారడైజ్'నే ఆయన ఎంచుకోవడం మాత్రం ఇప్పుడు సినిమాకు అదనపు ప్రచారంగా మారింది.

## అక్టోబర్ 1న మరో టెట్ నోటిఫికేషన్..

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మరో కీలక అప్ డేట్ వెలువడింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న టెట్ (TGTET) రెండో విడత నోటిఫికేషన్ ను అక్టోబర్ 1న విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను మెరుగుపరచడం, వారికి సకాలంలో పదోన్నతులు, అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా రెండుసార్లు ఈ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది ఇప్పటికే మొదటి విడత టెట్ ను విజయవంతంగా నిర్వహించి, తాజాగా నేడు వాటికి సంబంధించిన ఫలితాలను కూడా విద్యాశాఖ అధికారికంగా విడుదల చేసింది. ఈ తాజా ఫలితాల ప్రకటన ఉపాధ్యాయ వర్గాల్లో హర్షాతిరేకాలను నింపుతోంది. టెట్ లో అర్హత సాధించలేని వారికి ఇది మరొక అవకాశం అని చెప్పవచ్చు. అయితే మొదటి విడత టెట్ విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, ఇప్పుడు అందరి దృష్టి అక్టోబర్ 1న వెలువడనున్న రెండో విడత నోటిఫికేషన్ పైనే కేంద్రీకృతమైంది. ఈ స్పెషల్ టీజీటీ ఇన్ సర్వీస్ టీచర్స్-2026 రెండో విడత ఆన్ లైన్ పరీక్షలను నవంబర్ 16 నుంచి నవంబర్ 21 వరకు పకడ్బందీ ఏర్పాట్ల మధ్య నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత సాధించిన ఉపాధ్యాయులు తమ కెరీర్ పురోగతికి బాటలు వేసుకోవడానికి ఇదొక చక్కటి అవకాశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అక్టోబర్ 1న నోటిఫికేషన్ వెలువడిన వెంటనే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకానుండగా, ఉపాధ్యాయులు పరీక్షకు సిద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది.

## తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం చాకలి ఐలమ్మ..



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం.. తెలంగాణ సోయికి నిలువెత్తు నిదర్శనం చాకలి ఐలమ్మ అని మాజీ మంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలన సాగించడం ద్వారా మాత్రమే, ఐలమ్మకి నిజమైన నివాళి అర్పించినవాళ్ళమౌతామని తెలిపారు. నేడు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె త్యాగాలను స్మరించుకుంటూ మాజీ సీఎం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నాటి రాచరిక పాలనలో తెలంగాణ రైతాంగ న్యాయమైన హక్కుల కోసం ధిక్కార స్వరం వినిపించిన ధీరవనిత ఐలమ్మ అని, అణచివేతకు గురవుతున్న సబ్బండ కులాల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచారని కేసీఆర్ కొనియాడారు. నాటి భూస్వాములను ధైర్యంగా ఎదురించి ధిక్కారాన్ని చాటడమే కాకుండా, నాటి చట్టాల పరిధిలోని న్యాయస్థానాల్లో పోరాడి గెలిచి ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రదర్శించిన ఆమె పోరాట పంథా నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమన్నారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రస్తుత అస్తవ్యస్త పాలనా రాజకీయ పరిస్థితుల్లో, ఐలమ్మ చూపించిన ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి, తెలంగాణ సోయి నేటి యువత తప్పక అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. శాంతియుత పంథాలో తాను ప్రారంభించిన మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కూడా ఐలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని గుర్తుచేశారు.

ఐలమ్మ గొప్పతనాన్ని, ఆమె పోరాట చరిత్రను భవిష్యత్తు తరాలకు చాటేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సాంప్రదాయాన్ని నెలకొల్పిందని కేసీఆర్ తెలిపారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగానే పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళలు, శిశు సంక్షేమం, రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అనేక వినూత్న పథకాలను అమలు చేశామన్నారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తూ, కుల వృత్తులకు జీవం పోసి సబ్బండ వర్గాల ఆర్థిక, సామాజిక ఆత్మగౌరవాన్ని సమున్నతంగా నిలబెట్టామని, ఆ నమూనా సాధించిన ఫలితాలు నేడు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని చెప్పారు. తెలంగాణ రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలన సాగించడం ద్వారా మాత్రమే ఐలమ్మకు మనం నిజమైన నివాళి అర్పించినవాళ్లమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

# సైబర్ ముప్పులపై అప్రమత్తత అవసరం

**- సైబరాబాద్ పోలీస్ కమిషనర్**

ముద్ర, హైదరాబాద్: ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో పాటు పెరుగుతున్న సైబర్ ముప్పులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్ అన్నారు. 'ఐసాకా హైదరాబాద్ చాప్టర్' 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'ఫ్యూజన్-2026' వార్షిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా రక్షణ, సైబర్ సెక్యూరిటీ, రిస్క్ తదితర అంశాలపై చర్చించారు. డేటా రక్షణ, సైబర్ రిస్క్, డిజిటల్ మోసాల నివారణకు సంస్థలు, నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు, ఓటీపీ ఆధారిత లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసాకా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు సుజయ్ గంకిడి, ఉపాధ్యక్షుడు రాజ్ పవార్, సైబర్ సెక్యూరిటీ, ఆడిట్, రిస్క్ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



## గణేశ్ నిమజ్జనాల్లో తీవ్ర విషాదాలు

**తెలంగాణలో ఎస్సై సహా 13 మంది మృతి..**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో ఎంతో ఘనంగా జరిగిన గణేష్ నిమజ్జనోత్సవాల్లో కొన్ని విషాదకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. పండుగ సందర్భంగా జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. అత్యంత విచారకరమైన విషయమేమిటంటే.. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో విధి నిర్వహణలో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్ కూడా ఉన్నారు. ఈ చేదు వార్తను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా వెల్లడించారు. నిమజ్జనం సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు సంఘటనల వల్ల ఈ ప్రాణనష్టం, గాయాలు సంభవించాయని తెలిపారు. బందోబస్తులో ఉన్న ఓ ఎస్సై రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. పటాన్‌చెరువులో ఆరుగురు యువకులు, ఖైరతాబాద్, నిర్మల్‌లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. అలాగే డీజే సౌండ్స్‌తో గుండెపోటు గురై మరో వ్యక్తి మృతి చెందారు. ఇలా పలు ఘటనల్లో 13 మంది మృతి చెందడం బాధాకరమని డీజీపీ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక, ఈ ఏడాది నిమజ్జనం నిర్వహణపై డీజీపీ మాట్లాడుతూ.. కొన్ని ఆసక్తికరమైన గణాంకాలను పంచుకున్నారు. ఈ వినాయక చవితి పండుగ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 1.24 లక్షల వినాయక విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించారు. ఇవే కాకుండా ప్రజలు తమ ఇళ్లలో, గేటెడ్ కమ్యూనిటీలలో, అపార్ట్‌మెంట్లలో స్వయంగా పెట్టుకున్న విగ్రహాలను కూడా కలుపుకుంటే, రాష్ట్రవ్యాప్తంగా వినాయక విగ్రహాల సంఖ్య ఏకంగా 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్రంలోని వివిధ చెరువులు, జలాశయాల వద్ద ఎంతో కోలాహలంగా నిమజ్జన వేడుకలు సాగాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులను నియంత్రించడానికి, ఎటువంటి గొడవలు జరగకుండా చూడటానికి పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ తో పాటు భద్రతను కూడా పర్యవేక్షించారని వివరించారు. అంత విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ, ఈ దురదృష్టకర ప్రమాదాల్లో 13 మంది చనిపోవడం, 26 మంది గాయపడటం తీవ్ర విచారాన్ని నింపింది.

## కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన: మంత్రి పొంగులేటి



**ముద్ర, జనగామ:** రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన సాగుతోందని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జనగామలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దసరా నాటికి 2,18,000 ఇళ్లు పూర్తవుతాయన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేవలం కొన్ని నియోజకవర్గాలకే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల కోసం పని చేస్తుందని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను కూడా కొనసాగిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. దున్నపోతును తెచ్చుకున్నారు



**ముద్ర, హైదరాబాద్**: పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. ప్రజలు తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. పని చేస్తున్న ప్రభుత్వం కాళ్లల్లో కట్టెలు పెట్టొద్దనే కేసీఆర్ బయటికి రావట్లేదని తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లు కేసీఆర్ బయటకు రాకపోయినా ఆదరణ తగ్గలేదన్నారు. ఆయన బయటకి కనిపించకపోయినా.. ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారన్నారు. ప్రతి మహిళ, ప్రతి ఆడబిడ్డ ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమయానికి రైతుబంధు పడేదని గుర్తు చేస్తూ.. ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిందన్నారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త..

**- తెలంగాణలో మరో 13 కొత్త బస్టాండ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో ఆధునిక వసతులతో కూడిన నూతన బస్టాండ్లను నిర్మించనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, వాణిజ్య కార్యకలాపాలకు పెద్దపీట వేయడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం.నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాల్లో ఈ బస్టాండ్లు రానున్నాయి. ప్రయాణ సమయాల్లో వేచి ఉండే ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాళ్లు, ఆహారం, షాపింగ్ అన్నీ ఒకే చోట లభించేలా ఫుడ్ కోర్టులు, బిజినెస్ కాంప్లెక్స్‌లు, వినోద కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా కొడంగల్, మద్దూరు, కోస్గి, హుస్నాబాద్ ప్రాంతాలలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొడంగల్‌లో 1.91 ఎకరాల స్థలంలో రూ.15.82 కోట్లతో (మొదటి ఆప్షన్) లేదా రూ.11.53 కోట్లతో (రెండో ఆప్షన్) నిర్మాణాలు చేపట్టనున్నారు. కోస్గిలో 1.55 ఎకరాల్లో రూ.15.08 కోట్లు లేదా రూ.9.60 కోట్లతో, మద్దూరులో 1.05 ఎకరాల్లో రూ.7.60 కోట్లు లేదా రూ.4.48 కోట్ల అంచనా వ్యయాలతో ప్రణాళికలు సిద్ధం చేశారు. షాపులు, వ్యాపార సముదాయాల కేటాయింపులపై ఆసక్తి ఉన్న వ్యాపారులు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.ఈ ఆధునిక బస్టాండ్లు ప్రయాణ కేంద్రాలుగానే కాకుండా గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడనున్నాయి. బస్టాండ్లలో ఏర్పాటు చేసే దుకాణాలు, ఫుడ్ కోర్టుల ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, చిన్న వ్యాపారులకు, స్థానిక ఉత్పత్తులు విక్రయించే వారికి నూతన మార్కెట్ లభిస్తుంది. మొత్తంగా ఈ బస్టాండ్లు రవాణా, వాణిజ్యం, స్థానిక ఉపాధిని సమర్థవంతంగా అనుసంధానించే కేంద్రాలుగా అభివృద్ధి చెందనున్నాయి.

# వాడిన నూనె.. కుళ్లిన ఆహారం

**హైదరాబాద్ హోటల్స్‌లో మళ్లీ మళ్లీ వాడేస్తున్నారు..**
**ఫ్రీజర్‌లో కుళ్లిపోయిన ఆహారం..**



**ముద్ర, హైదరాబాద్** : హైదరాబాద్ హోటల్స్‌లో వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడేస్తున్నారు.. ఫ్రీజర్‌లో కుళ్లిపోయిన ఆహారం.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న రెస్టారెంట్ల నిర్వాహకుల గుట్టు రట్టవుతోంది. నగరంలోని హోటళ్లు, పబ్‌లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా అధికారులు జరిపిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి.

హైదరాబాద్‌లోని ప్రముఖ మాదాపూర్ మొనాస్టరీ యాంఫి బ్రూవరీలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వంటగదిలో ఏమాత్రం శుభ్రత లేకపోవడంతో పాటు పలు తీవ్ర ఉల్లంఘనలు బయటపడ్డాయి. ముఖ్యంగా ఆరోగ్యానికి హానికరమైన దాదాపు 5 కిలోల రీయూజ్డ్ వంట నూనెను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఇక రిఫ్రిజిరేటర్లను పరిశీలిస్తే మరింత దారుణమైన పరిస్థితులు కనిపించాయి. ఫ్రీజర్‌లో రోజుల తరబడి నిల్వ చేసిన వండిన ఆహార పదార్థాలతో పాటు, గడువు ముగిసిన ముడి పోర్క్ మాంసం కూడా ఉన్నట్లు తేలింది. ఎలాంటి లేబుల్స్, తయారీ తేదీలు లేని ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో భద్రపరచడం గమనార్హం. అంతేకాకుండా వంట తయారీ ప్రాంతంలో నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్లు, పగిలిన గుడ్లు, గడువు దాటిన పదార్థాలను వినియోగిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు.

మొనాస్టరీ బ్రూవరీతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. వరంగల్ నగరంలోని అల్ఫారమ్ హోటల్‌లో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి యాజమాన్యానికి ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. అలాగే కామారెడ్డిలోని మల్గుడి రెస్టారెంట్‌లోనూ తనిఖీలు నిర్వహించి వంటశాల పరిశుభ్రత, ఆహార నిల్వ విధానాలను పరిశీలించారు.

ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ఆహార భద్రతా అధికారులు రాష్ట్రవ్యాప్తంగా వరుస తడఖీలు చేపడుతున్నారు. గడువు తేదీలు, లేబులింగ్, నూనె పునర్వినియోగం వంటి నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడినట్లే అవుతుందని హెచ్చరిస్తూ తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 27.09.2026

4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## మంత్రి పదవుల్లో, ప్రాంతీయ
# ప్రాతినిధ్యానికి చోటెక్కడ?

రాజధాని పరిసర జిల్లాల జనాభా, ఆర్థిక ప్రాధాన్యానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం అవసరం. తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చర్చ మళ్లీ తెరపైకి వస్తోంది. ఈ సందర్భంగా ఒక ప్రశ్నను విస్మరించలేం. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, పట్టణాభివృద్ధికి కీలకంగా మారిన హైదరాబాద్–రంగారెడ్డి–మేడ్చల్ ప్రాంతాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉందా?

రాజధాని చుట్టూ విస్తరిస్తున్న నగరీకరణ, ఐటీ, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, రవాణా, భూముల సమస్యలు, మౌలిక వసతుల ఒత్తిడి, ఇవన్నీ ఈ ప్రాంతాన్ని రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకంగా మార్చాయి. అలాంటి ప్రాంతానికి రాజకీయ ప్రాతినిధ్యం కూడా ప్రజల దృష్టిలో ముఖ్యమైన అంశమే. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ అధికారిక జాబితాలో ముఖ్యమంత్రి సహా మంత్రుల నియోజకవర్గాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవిగా ఉన్నాయి. అయితే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి నేరుగా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఎంత అన్నది సహజంగానే చర్చకు వస్తోంది

పెట్టుబడుల నుంచి పట్టణ పాలన వరకు ఈ ప్రాంతానికి సవాళ్లున్నాయి.

కుల సమీకరణాల కంటే పనితీరు ముఖ్యం. మంత్రి పదవులపై చర్చ వచ్చినప్పుడల్లా కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, రాజకీయ లాబీయింగ్ వంటి అంశాలు ముందుకు వస్తాయి. కానీ ప్రజలకు అవసరమైన ప్రమాణం వేరుగా ఉండాలి. ఎవరు ఏ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు? ఎవరి వద్ద పరిపాలనా అనుభవం ఉంది? ఎవరు ప్రజా సమస్యలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లగలరు? ఎవరి పనితీరును కొలవగలం? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాల ఆధారంగా మంత్రివర్గ కూర్పు జరిగితేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

పునర్వ్యవస్థీకరణ జరిగితే ప్రమాణాలు స్పష్టంగా ఉండాలి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగితే అది కేవలం రాజకీయ సమీకరణాల మార్పుగా కాకుండా పనితీరు ఆధారిత పునర్వ్యవస్థీకరణగా ఉండాలి. ప్రాంతీయ ప్రాతినిధ్యం లోపించిన చోట దాన్ని సరిచేయాలి. దీర్ఘకాలంగా ప్రజా సమస్యలను ముందుకు తీసుకువస్తున్న అనుభవజ్ఞులకు తగిన ప్రాధాన్యతివ్వాలి. అదే సమయంలో పనితీరుపై ప్రజల్లో ప్రశ్నలు ఉన్నవారిని కూడా సమీక్షించాలి.



2023 అసెంబ్లీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలిచిన స్థానాలు పరిమితంగానే ఉన్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపు మాత్రం స్పష్టమైన మెజారిటీతో నమోదైంది. ఆయనకు 1,26,506 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థిపై 36,700 ఓట్ల ఆధిక్యం వచ్చింది ప్రాతినిధ్యం అంటే పదవుల పంపకమేనా? మంత్రివర్గంలో ప్రతి జిల్లాకు తప్పనిసరిగా ఒక పదవి ఇవ్వాలనే రాజ్యాంగ నిబంధన లేదు. మంత్రివర్గ కూర్పులో ప్రాంతం, సామాజిక సమీకరణం, రాజకీయ సమతుల్యత, పరిపాలనా అవసరాలు, పార్టీ అంతర్గత సమీకరణాలు వంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి.

కానీ ప్రజాస్వామ్యంలో మరో ప్రమాణం కూడా ఉంది. ప్రజలకు తమ ప్రాంతం ప్రభుత్వ నిర్ణయ వ్యవస్థలో వినిపిస్తోందనే నమ్మకం. రాజధాని విస్తరణతో హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల ప్రాధాన్యం పెరుగుతున్న కొద్దీ ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. భూముల సమస్యల నుంచి మౌలిక వసతుల వరకు, పారిశ్రామిక

ఇది ఒక్క రంగారెడ్డి జిల్లాకే పరిమితమైన ప్రశ్న కాదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌తో పాటు ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ, పాత జిల్లాలన్నింటికీ సమతుల్య ప్రాతినిధ్యం ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. మంత్రి పదవి ఎవరికివ్వాలన్నది రాజకీయ నిర్ణయం. కానీ ఏ ప్రాంతానికీ తన గొంతు ప్రభుత్వంలో వినిపించడం లేదనే భావన రాకుండా చూడటం మాత్రం ప్రజాపాలన బాధ్యత

తెలంగాణ అభివృద్ధి ఇక ఒక్క ప్రాంతం చుట్టూ తిరిగే స్థాయిలో లేదు. హైదరాబాద్ రాష్ట్ర ఆర్థిక ఇంజిన్ అయితే, దాని చుట్టూ ఉన్న జిల్లాలు దాని విస్తరణకు కీలక ఆధారం. అందుకే మంత్రివర్గ కూర్పులో కూడా ప్రాంతీయ సమతుల్యత, సామాజిక సమతుల్యత, అనుభవం, పనితీరు, ఈ నాలుగు ప్రమాణాలకు సమాన ప్రాధాన్యం దక్కాలి. ప్రజా ప్రభుత్వం అంటే కేవలం సంక్షేమ పథకాలు అమలు చేయడం కాదు. ప్రతి ప్రాంతానికీ ప్రభుత్వం తనదేననే నమ్మకం కల్పించడం కూడా ప్రజాపాలనలో అంతర్భాగమే.

**-కొలను వెంకటేశ్వర రెడ్డి**

# తిరుమల ఆన్‌లైన్ బుకింగ్స్‌పై వివరణ

**ముద్ర, తిరుమల:**
శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు తితిదే (TTD) వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థలను తితిదే.. అధిక డిమాండ్‌కు తగ్గట్టుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠంగా నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అందుబాటులో ఉన్న కోటాతో పోలిస్తే డిమాండ్ దాదాపు 9 రెట్లు అధికంగా ఉంటుందని పేర్కొంది. ఈ కారణంగా టికెట్లు అత్యంత తక్కువ సమయంలోనే పూర్తవుతాయని వివరించింది. టికెట్ లభించకపోవడాన్ని, ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ పని చేయకపోవడాన్ని ఒకటిగా పరిగణించవద్దని తితిదే స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది.




టికెట్ల విడుదల సమయంలో ప్రత్యేక Technical War-Room ఏర్పాటు చేసి, Application Performance, Infrastructure Health, Transactions, Security తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించే విధంగా సాంకేతిక బృందాలు పని చేస్తున్నాయని తెలిపింది. అధిక డిమాండ్ ఉన్న బుకింగ్ సమయంలో సుమారు 6 లక్షల మంది యూజర్లు టికెట్ల కోసం ప్రయత్నిస్తుండగా.. ఒక్కో యూజర్ సగటున నలుగురు కుటుంబ సభ్యుల కోసం ప్రయత్నిస్తే సుమారు 24 లక్షల టికెట్లకు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని తితిదే తెలిపింది. అయితే, అందుబాటులో ఉన్న కోటా సుమారు 2.69 లక్షల టికెట్లు మాత్రమేనని వెల్లడించింది. వేలాది మంది ఒకే సమయంలో ఒకే స్లాట్ కోసం ప్రయత్నించడంతో టికెట్లు అత్యంత తక్కువ సమయంలోనే పూర్తవుతాయని వివరించింది.




## ప్రకృతి ఒడిలో
# ప్రశాంత జీవనం
### హైదరాబాద్‌లో మరో లగ్జరీ విల్లా ప్రాజెక్ట్

హైదరాబాద్‌లో లగ్జరీ విల్లా ప్రాజెక్టులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో "బ్రిక్స్ ఎలైట్ ఇన్‌ఫ్రా" Bricks Elite Infra సంస్థ 'Velora' పేరుతో ప్రీమియం రెసిడెన్షియల్ కమ్యూనిటీని అభివృద్ధి చేస్తోంది. నగరానికి సమీపంలో ఉన్నప్పటికీ ప్రశాంతమైన, పచ్చదనంతో కూడిన వాతావరణంలో విల్లా జీవనాన్ని అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశంగా సంస్థ చెబుతోంది.




**7 ఎకరాల్లో.. 69 లగ్జరీ విల్లాలు**

Velora ప్రాజెక్ట్ సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానుంది. ఇందులో మొత్తం 69 విల్లాలు ఉండనున్నాయి. ఒక్కో విల్లాకు 238 నుంచి 314 చదరపు గజాల వరకు ప్లాట్ సైజులు అందుబాటులో ఉంటాయని సంస్థ వెల్లడించింది. ప్రైవసీ, విశాలమైన నివాస ప్రదేశాలు, సహజ కాంతి, ఆధునిక లేఅవుట్‌లకు ప్రాధాన్యం ఇస్తూ విల్లాలను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. రోజువారీ జీవితంలో ప్రశాంతత, సౌకర్యం, ప్రకృతికి దగ్గరగా ఉండే అనుభూతిని అందించడమే ప్రాజెక్ట్ కాన్సెప్ట్‌గా కనిపిస్తోంది.

**క్లబ్‌హౌస్‌లో ఎన్నో సౌకర్యాలు**

Veloraలో నివాసితుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకమైన క్లబ్‌హౌస్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో మల్టీపర్పస్ హాల్, జిమ్, పార్టీ హాల్, ఇండోర్ గేమ్స్, గెస్ట్ బెడ్‌రూమ్స్, కిడ్స్ పూల్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు ఉంటాయి. అదనంగా బ్యాడ్మింటన్ కోర్టు, పార్కింగ్‌తో పాటు కార్ లిఫ్ట్ వంటి సదుపాయాలను కూడా ప్రాజెక్ట్‌లో భాగంగా రూపొందిస్తున్నారు.

**మసీద్ గడ్డ ఫారెస్ట్‌కు సమీపంలో..**

Velora ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణల్లో లొకేషన్ ఒకటిగా సంస్థ పేర్కొంటోంది. ప్రొటెక్టెడ్ మసీద్ గడ్డ ఫారెస్ట్కు సమీపంలో ఈ ప్రాజెక్ట్ ఉన్నట్లు వెల్లడించింది. దీంతో నగరానికి కనెక్టివిటీతో పాటు పచ్చదనం, ప్రశాంత వాతావరణం అందుబాటులో ఉంటుందని చెబుతోంది. లొకేషన్ పరంగా తుక్కుగూడ ORR ఎగ్జిట్‌కు సుమారు 5 నిమిషాలు, అంతర్జాతీయ విమానాశ్రయానికి 15 నిమిషాలు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సుమారు 30 నిమిషాల దూరంలో ఉన్నట్లు ప్రాజెక్ట్ వివరాల్లో పేర్కొన్నారు.

**ప్రకృతి.. ప్రైవసీ.. కమ్యూనిటీ**

Velora రూపకల్పనలో మూడు అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు సంస్థ చెబుతోంది. Sanctuary, Connection, Clarity అనే కాన్సెప్ట్‌ల ఆధారంగా ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. ప్రైవేట్ విల్లాలతో పాటు గ్రీన్ స్పేస్‌లు, రిక్రియేషన్ జోన్లు, కమ్యూనిటీ సదుపాయాలను సమన్వయం చేస్తూ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ప్రైవసీకి భంగం కలగకుండా, అదే సమయంలో కమ్యూనిటీ లైఫ్‌ను ఆస్వాదించేలా వివిధ జోన్లను ప్లాన్ చేసినట్లు సంస్థ తెలిపింది.




**ప్రశాంతమైన లగ్జరీ లైఫ్‌స్టైల్‌కు చిరునామాగా..**

నగర విస్తరణ వేగంగా జరుగుతున్న సమయంలో.. ట్రాఫిక్, కాలుష్యం, రద్దీకి దూరంగా ఉండే ప్రశాంతమైన నివాస ప్రాంతాలపై ఆసక్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నగరానికి కనెక్టివిటీని కొనసాగిస్తూనే ప్రకృతికి దగ్గరగా ఉండే విల్లా లైఫ్‌ను కోరుకునే వారి కోసం Veloraను రూపొందించినట్లు Bricks Elite Infra చెబుతోంది. మొత్తంగా చూస్తే.. లగ్జరీ, ప్రకృతి, ప్రైవసీ, ఆధునిక సౌకర్యాలను ఒకే కమ్యూనిటీలో అందించాలనే లక్ష్యంతో Velora ప్రాజెక్ట్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది.

# ఎదిగే వారిపై అసూయపడకు

మనకు ఉండే చెడు గుణాలలో "అసూయ" కూడా ఒకటి. మనకు దగ్గరి వారు ఉన్నత స్థానంలో ఉన్నా, మనం పనిచేసే ఆఫీసులోనో, మన ఇంటి పక్కనో, మన బంధువులలోనో ఎవరైనా పై స్థాయికి ఎదుగుతూ ఉంటే అతడిని/ఆమెను క్రిందికి ఎలా లాగాలా అని చూసే కళ్ళు డజన్ల కొద్దీ ఉంటాయి. ఇదంతా ఎందుకు. ఎదిగిన వ్యక్తి ఎలా ఎదిగాడు. వాటికి గల కారణాలు ఏమిటి అతడి నుండి మనం ఏం ప్రేరణ పొందుతున్నాం అని ఆలోచించకుండా ఎప్పుడు క్రిందకు గుంజాలా అని చూడటమే పనిగా పెట్టుకుంటారు. అలాంటి వారు జీవితంలో ఎదగరు. ఎందుకంటే వారి కళ్ళముందే ఓ వ్యక్తి ఎదుగుతూ ఉంటే సహించలేనివారు, వారు స్వయంగా ఎదగటానికి ఎలాంటి ప్రణాళికలు



**డా.మహమ్మద్ హసన్**
అసిస్టెంట్ ప్రొఫెసర్
పర్సనాలిటీ డెవలప్మెంట్ ఎక్స్పర్ట్
సెల్ : 9908059234

రచించుకుంటారు చెప్పండి. వారి ఆలోచన మొత్తం వారి గురించి కాదు. వారి కళ్ళముందు ఎదుగుతున్న వ్యక్తి పతనాన్ని కళ్ళారా చూసి ఆనందించాలని (Ego satisfaction) వేయి కళ్ళతో నిరీక్షిస్తూ ఉంటారు. ఒకవేళ వారు ఊహించినదే జరిగితే అప్పుడు వారి "అహం" సంతృప్తి చెందుతుంది. ఇది ఓ రకమైన మానసిక వ్యాధిగానే (Mental disorder) పరిగణించాలి. మనతో ఎవరైనా ప్రయాణం చేస్తే వారికి ఎదైనా కావాల్సివస్తే "సహాయం" చేయమా? మరి అలా చేయకపోయినా ఎదుటి వారు పతనం కావాలని కోరుకునేవారు మానసిక రోగులు కాకపోతే ఏమిటి? ఒకవేళ మీకు అలాంటి ఆలోచనలు ఉంటే విరమించుకోండి. అలాంటి వారి కోసమే కథ.

మనస్తత్వ శాస్త్రంలో (సైకాలజీ) ఓ భయంకర నియమం ఉంది. సామూహిక (Diderot effect) విధ్వంసం. మనకు అర్థం అయ్యే భాషలో చెప్పాలంటే తాచెడ్డ కోతి వనమంతా తగుల బెట్టినట్లు. మానవ స్వభావం ఎంత భయకరంగా ఉంటుందో ఈ కథ మనకు తెలియజేస్తుంది.

ఒక అడవిలో ఒక చెట్టు కొమ్మకు చనిపోయిన జింక శరీరం వేలాడుతూ ఉంటుంది. దాని వాసన పసిగట్టిన హైనాలు దాని పరిసరాల్లోకి చేరి చనిపోయిన జింకను ఎలా చేరుకోవాలా అని అటూ ఇటూ పచార్లు కొడుతూ ఉన్నాయి. కానీ ఆ సమూహంలో ఏది కూడా జింకను చేరుకోలేకపోతున్నాయి. కారణం చెట్టు కొమ్మ హైనాలకు అందకుండా ఉండటమే. అప్పుడే ఓ హైనా తన తోటి హైనా వీపు పైకి ఎక్కి అమాంతం గాల్లోకి ఎగిరి 68 జింక మాంసం ముక్కను తన పదునైన పళ్ళతో లాగి క్షణాల్లో మింగేసింది. క్షణాల్లో జరిగిన ఈ సంఘటనను చూసిన మిగతా "హైనాలు" దాని పట్ల "అసూయ" (Jealousy)తో మేమంతా అకలితో ఉండగా నువ్వు ఒక్కడివే తింటావా అని వాటికనిపించి మరుక్షణమే హైనాల గుంపు దానిపై దాడి చేసి దానిని నిర్దయగా చీల్చివేశాయి. దాని మెడను నమిలి కాలిని విరిచివేశాయి. దాని ప్రాణం పోయేంత వరకు వాటి కోపం శాంతించలేదు. ఇప్పుడు అన్నీ సంతృప్తిగా ఉన్నాయి. ఎందుకంటే "సమూహాన్ని" కాదని జింక మాంసాన్ని తిన్న "హైనా" మిగతా వాటి దాడిలో చనిపోయింది. కారణం వాటికి మాంసం దొరకలేదు.

ఈ క్రమంలో ఒక సింహం అక్కడికి వచ్చింది. అది ఒక్క ఉదుటన జింక మృత శరీరాన్ని చెట్టుపై నుండి క్రిందికిలాగి హాయిగా తిన సాగింది. అంతకు ముందే తమ తోటివాడిని చీల్చుకు తిన్న తోటి హైనాలు వెంటనే భయపడి వెనక్కి తగ్గాయి. సింహం ముందుకు వెళ్ళడానికి సాహసించలేదు. ఇదే మానవ నైజంలో అత్యంత క్రూరమైన నిజం (Cruel Factor) మీరు కొద్దిగా ఎదిగినా మీ తోటి వారు, మీ రక్త సంబంధీకులు, మీ ఇరుగు పొరుగు వారు, మీ పరిసరాలలోని ఆఫీసు సిబ్బంది ఇలా ఎవరైనా కావొచ్చు. వారిలో అసూయతో కూడిన బీజాలు మొలకలు వేస్తాయి. వాళ్ళకంటే కొంచెం ఎక్కువ సంపాదించినా పైస్థాయిలో ఉన్నా అది వారి "అసూయ" (Jealousy))కి కారణమవుతుంది. కానీ మీరు వారిని వారి ఉద్దేశాలను, నెగిటివ్ మాటలను, విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగితే అప్పుడు వారు అసూయను వదిలి మిమ్మల్ని పొగడటం ప్రారంభిస్తారు. అందుకే మిత్రులారా స్వార్థంతో ముందుకు వెళ్ళే హైనాల మాదిరిగా ఉండకండి. మీరు కావాలనుకుంటే మీ బలాన్ని చూపి ఎవరూ మీకు ఎదురు నిలబడటానికి సాహసించని "సింహం"లా (Lion) ఉండాలి.

బహుశా ఈ కథను నేను ఇంతకన్న ఎక్కువ విశ్లేషించదల్చుకోలేదు. ఇందులో అర్థంకాని లోతైన విషయం ఏమీలేదు. నిత్యం మనం ఇలాంటివి ఎన్నో చూస్తూ ఉంటాం. అసూయ అంటే పక్కోడి కొవ్వొత్తి వెలుగుతుంటే నీ కొవ్వొత్తి ఆరిపోయినట్టు ఫీల్ అవ్వడం. నిజానికి వారి వెలుగు వల్ల మీ వెలుగు తగ్గదు. "అసూయ" ఉన్న వాడి ఆయుష్షు తగ్గిపోతుంది. విషం తాగినట్టే ఎప్పుడూ కుమిలిపోతూ, సుఖం లేకుండా బ్రతుకుతాడు. అందుకే భర్తృహరి చక్కని పద్యంలో "పరుల శుభము జూచి పరితపించెడువాడు. ధరణిలోన వాడు దరిద్రుడగును పరుల కీడు కోరు పాపాత్ముడెప్పుడు మరణ వేదనలను మరుగకుండు" అంటాడు. అసూయ వల్లనే ధుర్యోధనుడు అధోగతి పాలు అయ్యాడు. మందర మాటలు విని కైక రాముడి పట్టాభిషేకం మీద "అసూయ" పడింది. రాముడి వనవాసం కోరింది. ఫలితం భర్త దశరథుడి మరణం. కొడుకు భరతుడు తల్లిని (కైకను) తిట్టడంతో (దూషించటం) జీవితాంతం అపకీర్తినిమూటగట్టుకుంది. అలాగే రావణుడు సీత నాకు దక్కనిది రాముడికి దక్క కూడదని "అసూయ" చెందాడు ఫలితం మీకు తెలుసు.




అలాగే శకుని, కర్ణుడు, ధృతరాష్ట్రుడు, హిరణ్యకశపుడు, శిశుపాలుడు (విశ్వామిత్రుడు–వశిష్టుడి మీద అసూయ పడతాడు) సత్రాజిత్తు ఇలా ఎందరో అసూయపడి అధోగతి పాలైనారు. కాబట్టి అసూయపడితే మీరు ఎక్కడున్నారో అక్కడే ఆగిపోతారు. పైగా ఉన్నది కూడా పోతుంది. అందుకే ఎవరి మీద "అసూయ" చెందకండి మీరు ఎలా ఎదగాలో ప్రణాళికలు రచించుకోండి. అసూయ పడినంత మాత్రాన సింహం నక్కలా మారదు పిల్లి పులిలా మారదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే పరుల సోమ్ము "పాము" వంటిది. అసూయ పడటం అంటే పాముని కావాలని నెత్తిన పెట్టుకోవడమే. కాబట్టి పక్క వాళ్ళ సంపద చూసి ఓర్వలేక ఏడ్చే ధుర్మార్గుడు బతకగలడా? చెట్టు నీడ పక్కన ఉన్న చెట్టుకి తగిలితే ఆ చెట్టు కరిగి పోతుందా? లేదు కదా! "అసూయ" వల్ల మీకే నష్టం, ఎదుటి వారికి కాదని గమనించండి.

ఈ వ్యాసం ఇటీవలే వచ్చిన "మిమ్మల్ని మీరు తెలుసుకోండి 'వ్యక్తిత్వ వికాసం పుస్తకం నుండి

## ముక్కు కవాటం జారినా ఇబ్బందే..

ముక్కులోని శ్వాస మార్గం సన్నబడే ప్రాంతంలోని కణజాలం బలహీనపడి కిందికి జారితే గాలి ప్రవాహం తగ్గుతుంది. బయటకు పెద్దగా కనిపించకపోయినా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గురక వంటి సమస్యలు రావొచ్చు.



# మన్మోహన్ సింగ్ కు భారతరత్న ఇవ్వాలి

**ఆర్థిక సంస్కరణలతో దేశానికి కొత్త దిశ..**
**తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర**
**ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి**
**సీఎం రేవంత్‌రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 26:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నిజం చేసి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్ లో ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కొన్ని సమయాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ అంశాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతామన్నారు. పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించాలని రాజ్యసభ సభ్యులకు సూచించారు. మన్మోహన్ సింగ్ జయంతి రోజున ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ముఖ్యమంత్రిగా తనకు గర్వకారణమని తెలిపారు. భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతోనే ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు ఆయన వన్నె తెచ్చారన్నారు. 1991 లో దివంగత ప్రధాని పీవీ సర్సింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ పనిచేశారని, అప్పుడు ఆయన తీసుకువచ్చిన సంస్కరణలే దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకునేలా చేశాయని గుర్తు చేశారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని సీఎం తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సంస్థలు హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి సేవలు అందిస్తున్నాయని, అలాంటి ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సముచితం అని భావించామని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర నెహ్రూ–పటేల్, సోనియా–మన్మోహన్చరిత్రలో తెలంగాణను రెండు భాగాలుగా చూస్తుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో కలిపి స్వాతంత్ర్యం అందించిన ఘనత తొలి ప్రధాని నెహ్రూ, వల్లభాయ్ పటేల్ ది అయితే... దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ది అని సీఎం గుర్తు చేశారు. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ ఆయన చేసిన సంతకాన్ని ఇక్కడ పదిలపరిచామని సీఎం తెలిపారు. మన్మోహన్ సింగ్ ఎన్నో సరళీకృత విధానాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం 2013 తీసుకొచ్చిన ఘనత సోనియా, మన్మోహన్ సింగ్ ఘనత అని తెలిపారు. భూమి కలిగిన వారితో పాటు భూమిలేని పేదలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని పునరావాస చట్టం ద్వారా హక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆయన చేసిన ఆలోచనలు, తీసుకువచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'పింక్ పవర్ రన్ 3.0'కి హైదరాబాద్ సిద్ధం

**నెక్లెస్‌రోడ్డుపై ఆదివారం పరుగుల సందడి**
**నాలుగు విభాగాల్లో పరుగు..**
**విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు**




**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబరు 26:** మహిళల్లో రొమ్ము క్యాన్సర్ (బ్రెస్ట్ క్యాన్సర్)పై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రారంభమైన పింక్ పవర్ రన్ మూడో ఎడిషన్‌కు హైదరాబాద్ సిద్ధమైంది. ఎంఈఐఎల్, సుధా రెడ్డి ఫౌండేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పరుగులో పాల్గొనేందుకు ఇప్పటికే దాదాపు 35 వేల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి నెక్లెస్‌రోడ్డులోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వేదికగా పరుగులు ప్రారంభం కానున్నాయి.నాలుగు విభాగాల్లో పరుగుపింక్ పవర్ రన్ 3.0లో 3 కి.మీ., 5 కి.మీ., 10 కి.మీ., 21 కి.మీ. విభాగాల్లో పరుగులు నిర్వహించనున్నారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్, ప్రసాద్ ఐమ్యాక్స్ థియేటర్ సమీపం నుంచి ప్రారంభమయ్యే పరుగు.. నెక్లెస్‌రోడ్డులో కొనసాగి తిరిగి అదే ప్రాంగణంలో ముగుస్తుంది. వివిధ విభాగాల్లో విజేతలకు కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. వివిధ విభాగాల్లో విజేతలకు మొత్తం రూ.75 లక్షల నగదు బహుమతులను అందజేయనున్నారు.ఏటా పెరుగుతున్న ఆదరణపింక్ పవర్ రన్ తొలిసారి 2024లో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. రెండో సీజన్‌ను 2025లో నెక్లెస్‌రోడ్డులో నిర్వహించారు. ఏటా ఈ పరుగులో పాల్గొనే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. మూడో సీజన్‌కు ఇప్పటికే 35 వేల మందికిపైగా నమోదు చేసుకోవడం కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది.ప్రముఖుల సందడిఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, మాజీ మిస్ వరల్డ్ థాయ్‌లాండ్ ఒపల్ సుచాత, భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. థమన్, ప్రముఖ సినీ హీరో సిద్ధు జొన్నలగడ్డ తదితరులు హాజరు కానున్నారు. ఎస్. థమన్ ప్రత్యక్ష సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు.మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్ పి.వి. కృష్ణారెడ్డి, ఎంఈఐఎల్ ఫౌండేషన్, సుధా రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధా రెడ్డి పి. కార్యక్రమంలో పాల్గొననున్నారు.ఆరోగ్యం.. అవగాహన.. సాధికారతమహిళల ఆరోగ్యంపై, ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడం, ముందస్తు ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యాన్ని చాటిచెప్పడం లక్ష్యంగా పింక్ పవర్ రన్ నిర్వహిస్తున్నారు. వేలాది మంది ఒకే వేదికపై కలిసి పరుగెత్తడం ద్వారా ఆరోగ్యం, సామాజిక బాధ్యత, మహిళా సాధికారతకు సంబంధించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.

# నవంబర్ రెండో వారంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

**2027 వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి**
**అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక కమిటీ ముందు డిజైన్లు**
**భద్రత, నాణ్యతలో రాజీ లేదు**
**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 26:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.బేగంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి పునరుద్ధరణ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. గ్రౌటింగ్‌తో పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కట్–ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ప్రతిపాదనల్లో ఉన్నాయని తెలిపారు.ఎన్డీఎస్ఏ, ఇతర నిపుణుల సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని డిజైన్లను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. వరద ప్రవాహ పరిస్థితులను అంచనా వేసేందుకు పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్‌లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాలతో డిజైన్లను పరీక్షిస్తున్నట్లు తెలిపారు.ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచనున్నట్లు చెప్పారు. కమిటీ సూచనలు, సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.బ్యారేజీల భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల ఆధారంగానే పనులు చేపడతామని తెలిపారు. పునరుద్ధరణ పూర్తై అవసరమైన భద్రతా అనుమతులు లభించిన తర్వాతే మూడు బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

## ఏఐతో పర్యాటకానికి కొత్త ఊపు

**పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలి**
**పీపీపీ విధానంలో మౌలిక వసతులు, పెట్టుబడులకు ప్రోత్సాహం**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**




**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 26:** తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణకు ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.శనివారం శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 వేడుకలకు భట్టి విక్రమార్కతో పాటు పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ టూరిజం పునర్‌రూపకల్పన చేసిన వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్, కొత్త టూరిజం ట్రైలర్లు, ఏఆర్/వీఆర్ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.రాష్ట్రంలో ఆరోగ్య, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటకానికి విస్తృత అవకాశాలున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, చారిత్రక కట్టడాలను అంతర్జాతీయ స్థాయిలో సమర్థంగా మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని, ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, మౌలిక వసతులు అభివృద్ధి చేసి పెట్టుబడులను ఆకర్షించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులను వారాంతాల్లో తెలంగాణ పర్యాటక ప్రాంతాలకు ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఐటీ కంపెనీల ప్రతినిధులు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా పురావస్తు శాఖ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏఐ, డిజిటల్ టెక్నాలజీ, ఎకో, ఫిల్మ్, స్పోర్ట్స్, హెరిటేజ్ టూరిజంపై ప్యానెల్ చర్చ నిర్వహించారు. టూరిజం క్లబ్‌ల విద్యార్థులు, టూరిస్ట్ పోలీసులు, గైడ్లు, హోమ్‌స్టే నిర్వాహకులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఎక్సలెన్స్ అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

## వివేరా హోటళ్లకు పర్యాటక దినోత్సవ ప్రభుత్వ అవార్డు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి, నార్కట్‌పల్లి వివేరా హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి శనివారం హైదరాబాద్ శిల్పారామంలో సాంప్రదాయ వేదికపై శనివారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం – 2026 లో టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా విశిష్ట అవార్డును అందుకున్నారు. 42 ఏళ్లుగా రహదారి వెంట వసతి ఆహార సౌకర్యాలు కల్పిస్తూ హోటల్స్ నిర్వహిస్తూ, విఐపి లకు, అధికారులకు,ప్రయాణికులకు , ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయనకి ఈ అవార్డును అందజేసింది. టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ చైర్మన్ అర్జున్ రావు ,తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు. ఆయన వెంట వివేరా హోటల్స్ మేనేజర్ శివ తదితరు కున్నారు.తన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇప్పటికీ 9 సార్లు ఈ టూరిజం శాఖ అవార్డులను అందజేసిందని వెంకటరెడ్డి వివరించారు. ఈసారి కూడా అవార్డుని ఇచ్చినందుకు వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.




### ఆసియా క్రీడల పతక విజేత

## తరుణ్ మానేపల్లికి ఘన సన్మానం



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 26:** ఆసియా క్రీడలు–2026లో పురుషుల బ్యాడ్మింటన్ విభాగంలో కాంస్య పతకం సాధించి తెలంగాణతో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచిన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు తరుణ్ మానేపల్లిని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (SATG) వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనీబాలా దేవి, ఐఎఫ్ఎస్ శనివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసియా క్రీడల్లో పతకం సాధించడం తరుణ్ మానేపల్లి కృషి, అంకితభావం, పట్టుదలకు నిదర్శనమన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో తన క్రీడా ప్రస్థానాన్ని ప్రారంభించిన తరుణ్.. నేడు ఆసియా క్రీడల పతక విజేతగా ఎదిగి తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని తెలిపారు.తెలంగాణ యువ క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై సాధిస్తున్న విజయాలు రాష్ట్రంలోని అపారమైన క్రీడా ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరింత రాణించేలా ప్రపంచ స్థాయి శిక్షణ, ఆధునిక క్రీడా మౌలిక వసతులు, అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు.తరుణ్ మానేపల్లికి సంస్థ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపిన డాక్టర్ సోనీబాలా దేవి.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, తెలంగాణకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

### జ్ఞాపకశక్తి సమస్యతో బాధపడుతున్న

## యువతి అదృశ్యం



**ముద్ర, కూకట్పల్లి :** జ్ఞాపకశక్తి సమస్యలతో బాధపడుతున్న బినియా ఝాన్సీ (28) అనే యువతి హైదర్‌నగర్ పరిధిలో మాయమైనట్లు కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలం పల్లిపేట గ్రామానికి చెందిన బినియా దివ్య తన అక్క ఝాన్సీ, తమ్ముడితో కలసి కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని హైదర్‌నగర్ మిత్రాహిల్స్, సాయి కృప రెసిడెన్సీ ఫ్లాట్ నంబర్ 103లో నివాసముంటున్నారు.రెండేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో ఝాన్సీ తలకు తీవ్ర గాయమైంది. దాంతో ఆమె తరచూ జ్ఞాపకశక్తి కోల్పోతూ చికిత్స పొందుతోంది. ఈ నెల 26న ఉదయం 6 గంటల ప్రాంతంలో దివ్య, ఆమె తమ్ముడు పరీక్ష రాసేందుకు బయటకు వెళ్లారు. మధ్యాహ్నం 12:30 గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. ఫోన్ చేయగా అది ఇంట్లోనే మోగుతోంది. అనుమానం వచ్చి అపార్ట్‌మెంట్ సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా, ఉదయం 07:50 గంటలకు ఝాన్సీ చేతిలో ఎలాంటి వస్తువులు లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లినట్లు రికార్డయ్యింది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో దివ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెల్లెలి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కనిపించని యువతి వివరాలు: పేరు: బినియా ఝాన్సీ (28) ,ఎత్తు: 5 అడుగుల 5 అంగుళాలు , రైక /వస్త్రాలు: నల్లటి టాప్, ఆకుపచ్చ రంగు ప్యాంట్, భాషలు: తెలుగు, ఇంగ్లీష్, గుర్తులు: కుడిచేతిపై గతంలో జరిగిన ప్రమాదానికి సంబంధించిన కుట్ల మచ్చలు ఉన్నాయి.ఈ యువతి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోగానీ, కేపీహెచ్‌బీ పోలీసులకు గానీ సమాచారం అందించాల్సిందిగా కోరడమైనది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 26.09.2026
www.mudranews.in | @mudranews



## ముక్కు సమస్యకు చికిత్సే పరిష్కారం..

ముక్కుదిబ్బడ వల్ల నోటితో శ్వాస తీసుకుంటే నాలుక వెనక్కి పడటం, మృదువైన అంగిలి కంపించడం, శ్వాస మార్గం సన్నబడటం జరుగుతాయి. ఇవే గురక శబ్దానికి కారణమవుతాయి. కాబట్టి గురకకు గొంతే కారణమని భావించకుండా ముక్కు సమస్యలను కూడా గుర్తించి చికిత్స తీసుకోవాలి.



# మన్మోహన్ సింగ్ కు "భారత రత్న" ఇవ్వాలి

**ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి**
**కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నిజం చేసి ప్రజల ఆత్మగౌరవా న్ని నిలబెట్టిన మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్ లో ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కొన్ని సమయాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాల ని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ అంశాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతామన్నారు. పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించాలని రాజ్యసభ సభ్యులకు సూచించారు. మన్మోహన్ సింగ్ జయంతి రోజున ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ముఖ్యమంత్రిగా తనకు గర్వకారణమని తెలిపారు.

**భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం**

భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతోనే ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు ఆయన వన్నె తెచ్చారన్నారు.

**తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర నెహ్రూ-పటేల్, సోనియా-మన్మోహన్**

చరిత్రలో తెలంగాణను రెండు భాగాలుగా చూస్తుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో కలిపి స్వాతంత్ర్యం అందించిన ఘనత తొలి ప్రధాని నెహ్రూ, వల్లభాయ్ పటేల్ ది అయితే... దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ది అని సీఎం గుర్తు చేశారు. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ ఆయన చేసిన సంతకాన్ని ఇక్కడ పదిలపరిచామని సీఎం తెలిపారు. మన్మోహన్ సింగ్ ఎన్నో సరళీకృత విధానాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం 2013 తీసుకొచ్చిన ఘనత సోనియా, మన్మోహన్ సింగ్ ఘనత అని తెలిపారు. భూమి కలిగిన వారితో పాటు భూమిలేని పేదలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని పునరావాస చట్టం ద్వారా హక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆయన చేసిన ఆలోచనలు, తీసుకువచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై సీఎం సమీక్ష

**ముద్ర, అమరావతి,** సెప్టెంబర్ 26: రాష్ట్రంలో భారీ వర్షాలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో వరద పరిస్థితులపై సీఎం చంద్రబాబు శనివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం ఉచితంగా అందించాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. భారీ వర్షాలతో 29 రిజర్వాయర్లలో నీటి మట్టాలు పెరిగాయని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 23 నుంచి 26 వరకు అదనంగా 21 టీఎంసీల నీరు చేరిందన్నారు. పెరిగిన నీటిని రిజర్వాయర్లు, చిన్న, మధ్య తరహా నీటి వనరులకు మళ్లించాలని సీఎం సూచించారు. పులిచింతల–ప్రకాశం బ్యారేజీ మధ్య, అలాగే ప్రకాశం బ్యారేజీ దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలను కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో నదుల ప్రవాహాలు, ముంపు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

## ఈసీ ఉమ్మడి ప్రకటనపై చంద్రబాబు ట్వీట్

**ముద్ర, అమరావతి:** ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)పై ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా చేసిన ప్రకటన అపోహలకు ముగింపు పలికిందని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్.ఎస్. సంధూ, వివేక్ జోషి ఉమ్మడి ప్రకటన ఈసీ విశ్వసనీయతను స్పష్టం చేసిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ నిర్ణయాలు సంస్థాగత విధివిధానాల ప్రకారమే జరుగుతాయని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు దురదృష్టకరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను హుందాతనంతో స్వీకరించడం నాయకత్వ లక్షణమని, రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అందరి బాధ్యత అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

## ఏపీ ఐ&పీఆర్‌కు స్కోచ్ సిల్వర్ అవార్డు



**ముద్ర, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించినందుకు ప్రతిష్ఠాత్మక స్కోచ్ సిల్వర్ అవార్డు దక్కింది. న్యూఢిల్లీలో జరిగిన 109వ స్కోచ్ సమ్మిట్‌లో ఈ పురస్కారాన్ని అధికారులు అందుకున్నారు. ఇదే సందర్భంగా ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అమరావతి 'క్వాంటం వ్యాలీ' డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్ విభాగంలో గోల్డ్ స్కోచ్ అవార్డు లభించింది. ఐ&పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్ మార్గదర్శకత్వంలో చేపట్టిన డిజిటల్ అక్రిడిటేషన్ విధానానికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది.

# ఉత్తర తెలంగాణ రాజకీయాల మార్చే సభ సిరిసిల్ల సభ..







**- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..**
**- పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్ కు లేదు.. : మంత్రి శ్రీధర్ బాబు..**
**- యువరాజు కోటను బద్దలు కొడుతాం.. : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**
**- సిరిసిల్లలో ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో మంత్రులు..**

**ముద్ర, కరీంనగర్ :** ముద్ర, రాజన్న సిరిసిల్ల: ఈనెల 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించే సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్లలోని సాయి మణికంఠ గార్డెన్స్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయరమణారావు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. సిరిసిల్ల సభ దేశ రాజకీయాల్లో మార్పునకు దోహదపడేలా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వ అప్పులతో ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. 2014లో కాంగ్రెస్ నుంచి గెలిచిన 18 మంది ఎమ్మెల్యేల్లో 13 మందిని



బీఆర్ఎస్‌లో చేర్చుకుని పదవులు ఇచ్చారని ఆరోపించారు. సిరిసిల్లలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో యువరాజుగా పిలవబడే కేటీఆర్ కోటను బద్దలు కొట్టి సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు. ఈనెల 30న జరిగే సీఎం సభ అందుకు పునాదిగా మారుతుందని తెలిపారు.

సిరిసిల్లలో నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సభకు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కంకణ బద్ధులై ముందుకు సాగి దేనా సమీకరణ చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు అన్నారు. ముఖ్యమంత్రి గారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈనెల 30వ తేదీన సిరిసిల్లలో నిర్వహించి ముఖ్యమంత్రి సభ లక్ష మందితో నిర్వహిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇంటింటికి తిరిగి జన సమీకరణ చేయాలని పిలుపునిచ్చారు.

## సాహితీ సంస్థతో తమకు సంబంధం లేదు:

**ఆరెకపూడి గాంధీ**

**ముద్ర, హైదరాబాద్:** సాహితీ సంస్థ నుంచి రూ.2.1 కోట్లు తమకు వచ్చినట్లు మీడియాలో జరుగుతున్న ప్రచారంపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పందించారు. 2018లో కార్యాలయ స్థలం కోసం తమ ఖాతా నుంచి సదరు సంస్థకు ఆ మొత్తాన్ని చెల్లించామని తెలిపారు. కార్యాలయాన్ని కేటాయించలేకపోవడంతో సంస్థ తిరిగి తమ ఖాతాలోకి ఆ మొత్తాన్ని జమ చేసిందని వివరించారు. ఈ లావాదేవీకి సంబంధించిన వాస్తవాలను మీడియా మిత్రులకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. సాహితీ సంస్థ కార్యకలాపాలతో పాటు ఇతర వ్యవహారాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పేదల హక్కుల కోసం ఐక్యం కావాలి



**ముద్ర, సికింద్రాబాద్:** తెలంగాణ పౌరుషానికి, చైతన్యానికి చాకలి ఐలమ్మ నిలువెత్తు సాక్ష్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని సిఖ్ విలేజ్ ధోబీ ఘాట్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహానికి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. పేదరికంలో పుట్టినా అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని ఎదుర్కొంటూ ధర్మం కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయుల జయంతులు, వర్ధంతులు నిర్వహించడం కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, వారి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు సంకల్పం తీసుకోవాలని సూచించారు.నేటికీ పేదల ఇళ్లు కూల్చడం, భూములను లాక్కోవడం, భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని ఈటల పేర్కొన్నారు. పేదలు తమ ఇళ్లు, భూములు, హక్కులను కాపాడుకోవాలంటే ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన తెలిపారు.కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్, మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్, దిశా కమిటీ సభ్యుడు పరశురామ్, మాజీ కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు సదా కేశవ రెడ్డి, బి.ఎన్. శ్రీనివాస్, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయానంద్, 3వ వార్డు అధ్యక్షుడు అరుణ్, రజక సంఘం నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐతో తెలంగాణ టూరిజానికి కొత్త ఊపు



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 సందర్భంగా శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పలు నూతన కార్యక్రమాలను ప్రారంభించారు. తెలంగాణలోని ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదను ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేకంగా నిలిపేందుకు సమగ్ర మార్కెటింగ్ అవసరమని భట్టి పేర్కొన్నారు. హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటకానికి రాష్ట్రంలో విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. పీపీపీ విధానంలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, మౌలిక వసతులు కల్పించి పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ ఐటీ ఉద్యోగులను వారాంతాల్లో తెలంగాణ పర్యాటక ప్రాంతాలకు ఆకర్షించేలా 'టూరిజం కూపన్లు' వంటి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. శిల్పారామంలోని సాంప్రదాయ వేదిక లో ఘనంగా ప్రారంభమైన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు హాజరైన ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకల్లో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, టీజీఏ డైరెక్టర్ లక్షి , భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, సాహిత్య అకాడమీ సెక్రటరీ బాలాచారి, సినీ నటులు తిరువరూర్, ఫరియా అబ్దుల్లా పాల్గొన్నారు.

## 50రోజులుగా కొనసాగుతున్న నారాయణపూర్ ముంపు బాధితుల ఆందోళనలు

**- భూగర్భ శాఖ అధికారులను అడ్డుకున్న నారాయణపూర్ గ్రామస్తులు**
**- కొత్త జయపాల్ రెడ్డికి గోడు వెల్లబోసుకున్న నారాణయపూర్ ముంపు బాధితులు**
**- బాధితులను ఉమ్మడి జిల్లా మంత్రులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు:కొత్త జయపాల్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** నారాయణపూర్ బాధితులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని... బీఆర్ఎస్ సీనియర్ నేత కొత్త జయపాల్ రెడ్డి అన్నారు. మంత్రులకు మానవత్వం లేదని... ఇప్పటికైనా స్పందించకపోతే మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణ పూర్ గ్రామానికి విచ్చేసిన భూగర్భశాఖ అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న కొత్త జయపాల్ రెడ్డి హుటాహుటిన అక్కడకు చేరుకోగా.. ముంపు బాధితులు తమ గోడును వెల్లబోసుకున్నారు. మంత్రులకు మానవతా ధృక్పదం లేదన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన శ్రీధర్ బాబు, లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వందల కుటుంబాలు పిల్లాజెల్లలతో రోడ్డునకెక్కితే పట్టించుకున్న పాపాన లేదని మండిపడ్డారు. కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణపూర్ కు మంత్రులు వచ్చి పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. పైగా ముంపు బాధితులపై కేసులు పెడుతుంటే సహకరించడం అన్యాయమన్నారు. గత 50 రోజులుగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపడుతుంటే పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. హిందుత్వం పేరిట రాజకీయం చేసే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు రావడం లేదన్నారు. హిందుత్వం ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. గ్రామస్తులంతా వేరే రాష్ట్రం వాళ్లా... లేక వేరే దేశం వాళ్లా... అని నిలదీశారు. ప్రభుత్వ పథకాల ప్రచారాలకు వందల కోట్లు ఖర్చుచేస్తున్నారని ఆరోపించారు. ప్రాణాలు పోతే కానీ పరామర్శకు రారా అని మంత్రులను ప్రశ్నించారు. ప్రభుత్వానికి చేతులెత్తి మొక్కుతున్నానని... తక్షణమే ముంపు గ్రామ బాధితులను ఆదుకోవాలని కోరారు. లేనియెడల ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత కొత్త జయపాల్ రెడ్డి, భూగర్భ శాఖ అధికారులు, నారాయణపూర్ ముంపు బాధితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 27.09.2026
www.mudranews.in | @mudranews



## ముక్కు అలర్జీని నిర్లక్ష్యం చేయొద్దు..

ముక్కు అలర్జీతో లోపలి కణజాలం ఉబ్బి ముక్కుదిబ్బడ, తుమ్ములు పెరుగుతాయి. ముఖ్యంగా రాత్రివేళ గాలి ప్రవాహం తగ్గడంతో నోటితో శ్వాస తీసుకోవాల్సి వస్తుంది. దీంతో గురక సమస్య తలెత్తొచ్చు.



# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మనం ఆదర్శంగా తీసుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.శనివారం జిల్లా బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, అడ్మినిస్ట్రేషన్ అధికారి అంజిరెడ్డి,జిల్లా బి. సి అభివృద్ధి అధికారి సుబ్బారెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




**శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో..**
శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కనక బాలరాజు, తోటకూర రామకృష్ణ, ఎండీ. అత్తర్ ఫరీన్, లెక్చరర్లు సుధా, కే.కిష్టయ్య, మారుతి, రవీందర్, డాక్టర్ ఎన్ సత్యనారాయణ, ఎండీ.ఆసిఫ్, ఆర్.సిద్దిరాములు, బాలయ్య, బి.పాండురంగం. విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



**మున్సిపల్ కార్యాలయంలో..**
మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.చంద్ర ప్రకాష్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు కుక్కదువ్వు పద్మ సోమయ్య, చల్లగురుగుల కృష్ణవేణి రఘుబాబు, బెండ స్వరూప లాల్ రాజ్, సుమయ్య తబస్సుం షఫీక్ అహ్మద్, నాకోటి నగేష్ పాల్గొన్నారు.

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..**
జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. డి. అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ, ఈ కార్యక్రమం లో గ్రంథ పాలకుడు , గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**వలిగొండలో..**
వలిగొండ మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలిగొండ పిఎసిఎస్ చైర్మన్ గరిసే రవి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎలిమినేటి సత్యనారాయణ, పోలేపాక జానకి రాములు,మైసొల్ల ప్రవీణ్, మాజీ ఉపసర్పంచ్ మత్స్యగిరి పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం నేటితరానికి స్ఫూర్తిదాయకం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 26:** వెట్టిచాకిరీ, దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా



పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటితరానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వద్ద ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం ప్రజల్లో చైతన్యం నింపిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె ధైర్యసాహసాలు మహిళా శక్తికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, బీసీ సంక్షేమ అధికారి జి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిఖమ్మం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ నిజాం పాలన, దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించే నిర్ణయం మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బీచ్ మహల్ స్కూల్ ని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సమయంలో వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేసి పిల్లలతో మాట్లాడి తగిన సూచనలు చేశారు. వార్డు కౌన్సిలర్ పచ్చాల జగన్మోహన్, పాఠశాల ప్రిన్సిపల్ రామచంద్రయ్య మాట్లాడి స్కూల్ కు సంబంధించిన టీచర్ల కొరత ఉండటంతో తక్షణమే అధ్యాపకులను నియమించాలని డి ఈ ఓ తో ఫోన్లో తెలిపారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ చాగంటి సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**ఖమ్మంలో సీఈసీ దిష్టిబొమ్మ దహనం**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 26:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఖమ్మం ఎన్ఎస్టీ రోడ్డుపై సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ, ఓట్ల తొలగింపు అంశాల్లో ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. బీజేపీ, ప్రధాని మోదీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై. విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, వంగూరి రాములు, ఎం. సుబ్బారావు, మెరుగు సత్యనారాయణ, జబ్బార్, నందిపాటి మనోహర్, మెరుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనకు వ్యతిరేకంగా జైల్‌భరో




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 26:** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రజలను చైతన్యపరిచి, డిసెంబరు 2, 3, 4 తేదీల్లో ఐదు లక్షల మందితో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, సాగునీటి వనరులను వినియోగించి చెరువులు, కుంటలను నింపాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పోరాటాలు కొనసాగిస్తుందని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సామిల్ మిల్లులపై దుష్ప్రచారం మానుకోవాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 26:** దశాబ్దాలుగా ఉపాధినిస్తూ సేవలు అందిస్తున్న సామిల్ మిల్లులు, టింబర్ డిపోల యాజమాన్యాలపై కొందరు వ్యక్తులు చేస్తున్న దుష్ప్రచారాన్ని, బెదిరింపులను తక్షణమే మానుకోవాలని ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురివెళ్ల ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఛాంబర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి సోము నరసింహారావు, మాజీ అధ్యక్షులు కొప్పు నరేష్ కుమార్, చిన్ని కృష్ణారావులతో కలిసి ఆయన మాట్లాడారు.శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో అన్ని రకాల అనుమతులతో నడుస్తున్న సామిల్ వ్యాపారులపై దుమ్ము, ధూళి నెపంతో కావాలని భౌతిక దాడులకు, వ్యక్తిగత దూషణలకు దిగడం దారుణమన్నారు. ఇవి ప్రారంభించిన సమయంలో అక్కడ నివాసాలు లేవని, ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకున్న కొందరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యపై త్వరలోనే జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులను కలవనున్నట్లు తెలిపారు. ఇటువంటి బెదిరింపులు కొనసాగితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, సామిల్ అసోసియేషన్ ప్రతినిధులు బత్తిని నరసింహారావు, బాదే రమేష్, తల్లాడ రమేష్, రెడ్డివైన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి



**ముద్ర, వలిగొండ, సెప్టెంబర్ 26:** పొద్దుటూరు, ఎదుళ్లగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. బస్సు సౌకర్యం లేక రెండు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.శనివారం ఎదుళ్లగూడెం స్టేజీ వద్ద సీపీఎం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ యాదగిరిగుట్ట డిపో మేనేజర్, ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. గత మూడేళ్లుగా రెండు గ్రామాలకు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతున్నారని, పొద్దుటూరు, ఎదుళ్లగూడెం గ్రామాలకు ఎందుకు బస్సు ఏర్పాటు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో ఎదుళ్లగూడెం సర్పంచ్ కొంతం శ్రీనివాస్ గౌడ్, సీపీఎం నాయకులు దుబ్బ లింగం, భూమి మాధవి బాలశంకర్, పలుసం లింగం, డీవైఎఫ్ఐ నాయకుడు పెద్దబోయిన భీమరాజు, వార్డు సభ్యుడు దండు వేణు, బత్తుల నరసింహ, బత్తిని అంజమ్మ, బొడ్డు శంకర్, పెద్దబోయిన శివశంకర్, విద్యార్థులు, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఈ ఆదివారం బ్యాంకు పనిచేస్తుంది



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఈనెల 28 నుంచి 30 వరకు సమ్మె కారణంగా ఖాతాదారులకు అసౌకర్యం కలగకుండా ఉండటానికి ఆదివారం రోజు పనిచేసేలా ఆర్థిక శాఖ మరియు ఆర్ బి ఐ చర్యలు తీసుకుందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు .ఖాతాదారులు అందుబాటులో ఉన్న వివిధ రకాల డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. అత్యవసరమైన బ్యాంకింగ్ లావాదేవీలు ఏవైనా ఉంటే ఆదివారం రోజునే పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నాం.ఖాతాదారులు ముందస్తు ప్రణాళికతో తమ బ్యాంకింగ్ అవసరాలను పూర్తి చేసుకోవాలన్నారు.

## ఆహార భద్రతా ఉల్లంఘనలకు రూ.69,500 జరిమానా

**కల్తీ, నాసిరకం ఆహారం విక్రయిస్తే క్రిమినల్ కేసులు**

**ముద్ర, సూర్యాపేట, సెప్టెంబర్ 26:** ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన 7 కేసులను విచారించిన అధికారులు సంబంధిత నిర్వాహకులకు మొత్తం రూ.69,500 జరిమానా విధించారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆధ్వర్యంలో అడ్జుడికేషన్ విచారణ నిర్వహించారు. కేసుల వివరాలను FoSCoS పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జోనల్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి మాట్లాడుతూ ఆహార వ్యాపారులు తప్పనిసరిగా నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కల్తీ, నాసిరకం ఆహార పదార్థాలను విక్రయిస్తే భారీ జరిమానాలు విధించడంతో పాటు, నేరం తీవ్రతను బట్టి క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆహార భద్రతా అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జ్యోతిర్మయి స్పష్టం చేశారు. కార్యక్రమంలో యాదాద్రి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, సూర్యాపేట జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి

**జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు ఇవ్వాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.శనివారం మినీ మీటింగ్ హాల్ లో టీయస్ ఐ ఐపాస్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పెండింగ్ లో ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.టీఎస్ ఐపాస్, తప్రైడ్ స్కీం ల పథకం లో 8 మంది యస్ టి లబ్ధిదారులకు రాయితీ మంజూరీ ఇవ్వడం జరిగింది.ఒక్క పరిశ్రమకు రా మెటీరియల్ అలాట్ మెంట్ కు సంబదించి



వివరించడం జరిగింది.డీపీసి లో భాగంగా 8 మంది యస్. టి లబ్ధిదారులకు రాయితీ మరియు నాలుగు పరిశ్రమలకు సంబంధించి రా మెటీరియల్ మంజూరీ కి ఆమోదించడం జరిగింది. 8 మంది ఎస్టీ లబ్ధిదారులకు దాదాపు 19 లక్షల రాయితీ మంజూరీ కమిటీ సభ్యుల తో చర్చించి అమోదించడం జరిగిందని తెలిపారు..ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవీందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వీరన్న,ట్రాన్స్పోర్ట్ అధికారి నరేష్ ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి హోటళ్లలో తనిఖీలు

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండలంలోని టీజీ సేఫ్ కమిషనర్ ఆదేశాల మేరకు హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా యాదాద్రి జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి వి. జ్యోతిర్మయి పర్యవేక్షణలో నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్. శివశంకర్ రెడ్డి కొండమల్లేపల్లి మండలంలోని సాగర్ రోడ్డులో ఉన్న హోటల్ 7 (H7), ఎస్వీ ఫుడ్ కోర్టలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఆహార తయారీ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య ప్రమాణాలు సరిగా పాటించకపోవడం, రిఫ్రిజిరేటర్లలో లేబులింగ్ లేకుండా ఆహార పదార్థాలను నిల్వ చేయడం, రిఫ్రిజిరేటర్లను సక్రమంగా శుభ్రపరచకపోవడంతో ఫంగస్, దుమ్ము పేరుకుపోవడం, వంట గదిలో బొద్దింకలు కనిపించడం వంటి లోపాలను గుర్తించారు. పాడైపోయిన ఆహార పదార్థాలతో పాటు బిర్యానీ,



సోడాలు, సాస్‌లు, చేపలు, రొయ్యలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ తదితర పదార్థాలను నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆహార పదార్థాల్లో అనుమానాస్పద సింథటిక్ రంగుల వినియోగంపై అనుమానం వ్యక్తం చేస్తూ సంబంధిత ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు.నిబంధనలకు అనుగుణంగా లేని సుమారు 70 కిలోల ఆహార పదార్థాలను గ్రామపంచాయతీ ట్రాక్టర్, సిబ్బందీ సహకారంతో అక్కడికక్కడే తొలగించి పారవేశారు. గుర్తించిన లోపాలను సరిదిద్దేలా రెండు సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయాలని సిఫారసు చేశారు. పరిశుభ్రత, ఆహార నిల్వ, రిఫ్రిజిరేటర్ల నిర్వహణ, లేబులింగ్, పురుగుల నియంత్రణ తదితర అంశాల్లో లోపాలను పూర్తిగా సరిదిద్దే వరకు ఆహార కార్యకలాపాలను నిలిపివేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారి నిర్వాహకులకు సూచించారు. ప్రయోగశాల నుంచి అందే నమూనాల పరీక్షా నివేదికల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు కలిగి ఉండటంతో పాటు, లైసెన్సులో పేర్కొన్న నిబంధనలు మరియు ఆహార భద్రత, పరిశుభ్రత, పారిశుధ్య ప్రమాణాలను పాటిస్తూ వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి వి. జ్యోతిర్మయి సూచించారు.

# ప్రత్యేక ప్రతిభావంతులకు అండగా లీగల్ ఎయిడ్ క్లినిక్

**ముద్ర, సూర్యాపేట, సెప్టెంబర్ 26:** ప్రత్యేక ప్రతిభావంతులు, మానసిక వైకల్యాలతో బాధపడుతున్న వారికి చట్టపరమైన రక్షణ, ఉచిత న్యాయ సేవలు అందించేందుకు సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, స్కీమ్–2024 నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి డాక్టర్ పి. శివరామ్ ప్రసాద్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి భవ్య కోవిల శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జడ్జి డాక్టర్ శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులు,



మానసిక వైకల్యాలతో బాధపడుతున్న వారికి ఈ క్లినిక్ అండగా నిలుస్తుందన్నారు. బాధితులకు ఉచిత న్యాయ సలహాలు, సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. సమీకృత కలెక్టరేట్‌లోనే దివ్యాంగుల కోసం ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఎదురైనా బాధితులు సంకోచించకుండా క్లినిక్‌ను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు. కేంద్రం ద్వారా అందించే సేవలపై దివ్యాంగులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. హాసన్, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్యానెల్ న్యాయవాది దావుల చిన్న వీరప్రసాద్, పారా లీగల్ వాలంటీర్ జయ, న్యాయ, సంక్షేమ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 27.09.2026
www.mudranews.in | @mudranews



### ముక్కు దూలం వంకరగా ఉంటే..



ముక్కు దూలం పక్కకు వంగడం వల్ల గాలి ప్రవాహం తగ్గుతుంది. ముఖ్యంగా రాత్రిపూట ముక్కుతో శ్వాస తీసుకోవడం కష్టమై నోటితో శ్వాస తీసుకోవాల్సి వస్తుంది. దీంతో గురక వచ్చే అవకాశం పెరుగుతుంది.

# సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం దేశంలోనే టాప్

**30 వేల మంది విద్యార్థులకు అల్పాహారం**
**సెంట్రల్ కిచెన్ ప్రారంభించిన**
**మంత్రి డా. వివేక్**







**ముద్ర ప్రతినిధి, మెదక్:** దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు చేస్తున్నట్లు గనులు, భూగర్భ శాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి డా.వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం మెదక్ పట్టణంలో మార్కెట్ యార్డులో హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో నూతనంగా నిర్మించిన కేంద్రీకృత కిచెన్ ను స్థానిక ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. కేంద్రీకృత కిచెన్ యంత్రాలకు పరిశీలించి వాటి సామర్థ్యం, పనితీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్లో ప్రభుత్వ విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, విద్యార్థులతో పాటు కలిసి అల్పా హారాన్ని . స్వీకరించారు. అల్పాహారం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఓట్ల కోసం హామీలు ఇవ్వకుండా, ముఖ్యమంత్రి అల్పాహారం పథకం అమలు చేస్తున్నామన్నారు. నాణ్యమైన, పౌష్టికరమైన అల్పాహారం అందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి చదువుకోవాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 36 కిచన్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. ఇప్పటికే 10 వేల టీచర్స్ భర్తీ చేశాం, మెదక్ లో యంగ్ ఇండియా స్కూల్ ను 2,500 మంది విద్యార్థులకు వచ్చే సంవత్సరం నుండి ప్రారంభిస్తామన్నారు.మెదక్ కు 100 కోట్ల తో పబ్లిక్స్ స్కూల్ కూడా వచ్చిందని, తెలంగాణలో 12వ తరగతి విద్యార్థుల వరకు అల్పాహార పథకాన్ని అందిస్తామన్నారు. అల్పాహార పథకం రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులకు ఇస్తున్నామని, టెక్నాలజీ కోసం నూతనంగా ఏటీసీ సెంటర్ ప్రారంభించామని, అందులో శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా నాణ్యమైన, పౌష్టికాహారం అందించి, విద్య వైద్యంపై దృష్టి సారిస్తున్నామన్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర దాస్ మాట్లాడుతూ జిల్లాలో 30 వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కేంద్రీకృత కిచెన్ ను మొదట కొడంగల్ లో ప్రారంభించామన్నారు. ఈ పథకం ద్వారా కొడంగల్ పరిసర పాఠశాలలో 20% విద్యార్థులు అదనంగా పాఠశాలలో చేరుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, సీఈఓ కౌంతేయదాస ప్రభుజి, రవిలోచన దాస్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## రైతులు సాంకేతిక పద్ధతులను అనుసరించాలి

**మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** రైతులు సాంకేతిక పద్ధతులను పాటించాలని కార్మిక, ఉపాధి కల్పన, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి డా.వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం మెదక్ పట్టణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళా నిర్వహించారు. మంత్రి వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావులు హాజరయ్యారు. రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి పొదుపు పద్ధతులు, యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు.మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ..రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు, పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, ప్రభుత్వం రైతాంగానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక విధానాలను వ్యవసాయంలో అవలంబించాలని, తద్వారా అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు.కిసాన్ మేళాలో వివిధ వ్యవసాయ అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వ్యవసాయ యాంత్రీకరణ సంస్థలు మరియు విత్తన/ఎరువుల సంస్థల ప్రతినిధులు పాల్గొని రైతులకు అవసరమైన సమాచారం అందించారు. డీ ఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,శాస్త్రవేత్తలు సతీష్, సాంబాజి దత్తాత్రేయ నాల్కర్, ప్రొఫెసర్ నిర్మల, రాఘవేంద్ర, ఆదిత్య, ఏడి శ్రీధర్,

# ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**మంత్రి డా.వివేక్ వెంకటస్వామి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** సమాజ అభ్యున్నతికి వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కార్మిక, ఉపాధి కల్పన, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి డా.వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో ఆమె విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ...సామాజిక అన్యాయాలను ఎదురించి, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ఆమె ప్రదర్శించిన ధైర్యం, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి శాఖ జిల్లా అధికారి ఉపేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, అశోక్, రాము,వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్పీ శ్రీనివాస రావు నివాళులు



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్రపటానికి ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం, మహిళల గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ సూచించారు. యువత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు సందీప్ రెడ్డి, శైలందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రేవంత్‌ది ఫెయిల్యూర్ సర్కార్

**విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం**
**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 26:** లంగాణలో విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితులను చక్కదిద్దకపోతే ప్రజల తరఫున పోరాటం చేస్తామని ఆమె అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని విమర్శించారు.ఆదిలాబాద్ రిమ్స్‌లో చిన్నారుల మృతికి సంబంధించిన ఘటన బాధాకరమని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితులపై తనకు అందిన గణాంకాలు ఆందోళన కలిగించాయని తెలిపారు. 2020–21లో 6 వేల మంది, 2022–23లో 4,933 మంది, 2024–25లో 3,853 మంది పసిపిల్లలు మృతి చెందినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గత ఏడాది 1,046 మంది చిన్నారులు మృతి చెందినట్లు తన వద్ద ఉన్న వివరాలు చెబుతున్నాయని అన్నారు.వైద్య రంగానికి కేటాయింపులు పెంచాలివైద్య రంగానికి 10 శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి 5 శాతానికే పరిమితమయ్యారని కవిత విమర్శించారు. గత ఏడాది వైద్య రంగానికి రూ.13,192 కోట్లు కేటాయిస్తే రూ.9,242 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించకుండా మళ్లీ అదనపు కేటాయింపులు చేయడంపై కాగ్ ప్రశ్నించిందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని 11 ఆరోగ్య పథకాల్లో ఏడు పథకాలకు సున్నా బడ్జెట్ కేటాయించారని ఆమె ఆరోపించారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిమ్స్‌లో బెడ్ పొందేందుకు ఇబ్బందులు ఉన్నాయని, కొన్ని శస్త్రచికిత్సలకు నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. నీలోఫర్‌లో సామర్థ్యానికి మించి రోగులు ఉన్నప్పటికీ వైద్యులు, సిబ్బంది సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తాంఇకపై తమ పార్టీ నాయకులు ప్రతి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తారని కవిత తెలిపారు. ఆసుపత్రుల్లోని సమస్యలను ప్రజలు, యువత ఫొటోలు, ఆధారాలతో వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రులు, హాస్టళ్లను క్రమం తప్పకుండా సందర్శించాలని కోరారు.విద్యా రంగంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, బాలికలకు అవసరమైన కనీస సౌకర్యాలు కూడా లేవని ఆరోపించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు లేని చోట పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తించి ప్రజల సహకారంతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఐటీడీఏ నిధులు వినియోగించాలిఐటీడీఏలో నిధులు ఉన్నప్పటికీ వాటిని ప్రభుత్వం పూర్తిస్థాయిలో వినియోగించడం లేదని కవిత ఆరోపించారు. సాగునీరు, తాగునీటి సమస్యలపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోని ప్రజా సమస్యలపై తమ పార్టీ తరఫున ఉద్యమాలు కొనసాగిస్తామని చెప్పారు.ఆస్తులపై కవిత వ్యాఖ్యలుతన ఫామ్‌హౌస్‌లో గజం భూమి కూడా కబ్జా భూమి లేదని కవిత అన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా తన భూములు లేవని పేర్కొన్నారు. చట్టానికి లోబడే తాను ఆస్తులు సంపాదించుకున్నానని, అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క రూపాయి ఎక్కువగా ఉన్నట్లు నిరూపిస్తే ఆ ఆస్తిని వారికి ఇచ్చేస్తానని వ్యాఖ్యానించారు.ప్రభుత్వం పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. గతంలో ఫోన్ ట్యాపింగ్, ఇతర అంశాలపై సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేసినా వాటి పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు.ఖైరతాబాద్ ఉపఎన్నికలో పోటీఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ తరఫున కచ్చితంగా పోటీ చేస్తామని కవిత ప్రకటించారు. ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేసే విధానానికి ప్రజలు సమాధానం చెప్పాలని అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతతో ఆ స్థానం ఖాళీ అయిన నేపథ్యంలో ఉపఎన్నికకు మార్గం ఏర్పడిన విషయం తెలిసిందే.ఓటర్ల జాబితా సవరణపైనా కవిత ప్రశ్నలు లేవనెత్తారు. చిన్న క్లరికల్ తప్పిదాల కారణంగా ఓట్లు తొలగిస్తున్నారని, దీనిపై స్పష్టత అవసరమని అన్నారు.ప్రభుత్వం స్థలాలు కేటాయించిన ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనల ప్రకారం పేదలకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో నేరెళ్ల బాధితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. వారిపై జరిగిన దాడులకు బాధ్యులైన పోలీసులపై ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.విద్య, వైద్యం అంశాలను ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

## విద్యార్థులకు యూనిఫాం అందజేత




**ముద్ర ప్రతినిధి, మెదక్:**హవేలి ఘనపూర్ మండలం జక్కన్నపేట ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల విద్యార్థులకు స్కూలు యూనిఫాంలు ఎంఈఓ మధుమోహన్ అందజేశారు. సర్పంచ్ చామంతుల సత్యానారాయణ, ఉప సర్పంచ్ శీల కనకమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దత్తాత్రేయ కులకర్ణి, పంచాయతీ కార్యదర్శి విశాల్, వార్డు సభ్యులు బురక యాదగిరి, కోరబోయిన వసంత, మామిండ్ల నర్సింలు, ఉపాధ్యాయులు కృష్ణ, అశోక్, శృతి,గంట నర్సింలు పాల్గొన్నారు.

## అక్రమ రీఫిల్లింగ్ గోదాంపై దాడులు

**296 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం డీసిఎస్ఓ నిత్యానందం**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గోదాంపై దాడులు చేసి 296 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి పి. నిత్యానందం మాట్లాడుతూ... ఒక గోదాంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తున్నట్లు అందిన సమాచారంతో సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ నర్సిములు, మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో సివిల్ సప్లై సిబ్బంది, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు.ఈ తనిఖీల్లో గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన మొత్తం 296 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం, సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని నిత్యానంద్ తెలిపారు.ఇలాంటి అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్, సిలిండర్ల అక్రమ నిల్వ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది ఉండదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినా లేదా సమాచారం అందినా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మెదక్ కలెక్టర్కు "ఉత్తమ పర్యాటక ప్రతిభ అవార్డు"




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకునిమెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు ప్రతిష్టాత్మక "ఉత్తమ పర్యాటక ప్రతిభ అవార్డు" లభించింది. హైదరాబాద్ శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు.మెదక్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి, చారిత్రక కట్టడాల సంరక్షణకు, పర్యాటకులకు కల్పించిన మెరుగైన వసతుల విషయంలో జిల్లా యంత్రాంగం చూపిన అద్భుత ప్రతిభకుగాను ఈ పురస్కారం దక్కింది.రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటిని పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడంలో జిల్లా మెదక్ కలెక్టర్ తీసుకున్న చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలతో పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.అవార్డు గ్రహీత, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు రావడం వెనుక జిల్లా పర్యాటక శాఖ అధికారులు, సిబ్బంది మీడియా, ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. ఈ పురస్కారం తమపై బాధ్యతను మరింత పెంచిందని కలెక్టర్ పేర్కొన్నారు.అవార్డు అందుకున్న కలెక్టర్ ప్రతిమా సింగ్ ను టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, జిల్లా అధికారులు అభినందించారు.

## ఘనంగా పల్లకి సేవ







పౌర్ణమి పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గ మాత సన్నిధిలో అమ్మవారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం పల్లకి నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, పూజారులు, భక్తులు పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులిచ్చారు.

- ముద్ర ప్రతినిధి, మెదక్

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555